# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | గురువారం-18-డిసెంబర్-2025 | సంపుటి:3 | సంచిక:200 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in




## స్పీకర్ ప్రసాద్ కుమార్ పంచతంత్రం

**ఆ ఐదుగురు పార్టీ మారినట్లు రుజువు లేదు**

**తెల్లం, బండ్ల, గూడెం, ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి బిఆర్ఎస్ సభ్యులే**

**అనర్హత పిటిషన్లను కొట్టివేస్తూ స్పీకర్ సంచలన తీర్పు**

2లో





## శీతాకాల విడిదికి హైదరాబాద్‌కు చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**మేడ్చల్–మల్కాజిగిరి, డిసెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):**

శీతాకాల విడిదిలో భాగంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ప్రత్యేక విమానంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని హకీంపేట విమానాశ్రయానికి రాష్ట్రపతి చేరుకోగా, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె. రామకృష్ణ రావు, రాష్ట్ర డీజీపీ, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి శాలువాలు, పుష్పగుచ్చాలతో రాష్ట్రపతిని ఆహ్వానించారు.అనంతరం ప్రత్యేక వాహనంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రపతి నిలయానికి బయలుదేరారు. ఈ సందర్భంగా ముందుగానే హకీంపేటకు విచ్చేసిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీతక్క, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణ రావులకు జిల్లా కలెక్టర్ మను చౌదరి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, విజయేందర్ రెడ్డి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పల్లెపోరులో కాంగ్రెస్ హవా

**18 జిల్లాల్లో కాంగ్రెస్ ఆధిపత్యం.. ఏకగ్రీవాల్లోనూ కాంగ్రెస్‌దే పైచేయి**

**3,752 సర్పంచ్ స్థానాలకు ఉత్కంఠభరిత పోటీ**

**కొత్త సర్పంచులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం..**

**గ్రామస్థాయిలో కాంగ్రెస్ కేడర్ బలోపేతమే లక్ష్యం**

2లో





## పంచాయితీ ఎన్నికల్లో సింబల్ ఉంటే దుమ్ము రేగేది

**రెండేళ్లలోనే ఈ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత**

**గెలిచిన సర్పంచ్‌ల సన్మానంలో మాజీమంత్రి శ్రీనివాసగౌడ్**

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. ఈ ప్రభుత్వంతో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని మండిపడ్డారు. బుధవారం మహబూబ్‌నగర్‌లో పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్, వార్డు మెంబర్లను మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి ఆయన సన్మానించారు. అనంతరం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నపుడు కాంగ్రెస్ పార్టీ ఒకటి, రెండు మించి సర్పంచ్ స్థానాలను గెలవ లేదన్నారు. తమ పార్టీ అభ్యర్థులకు సింబల్ ఉంటే అధిక స్థానాలు కైవసం చేసుకునే వాళ్లమని చెప్పారు. గ్రామాలకు వచ్చే నిధులు ఎవ్వరు ఆపలేరని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఓటమి పాలయ్యే సరికి.. ఆ పార్టీ ఎమ్మెల్యేలు బెదిరింపులకు దిగారన్నారు. ఎమ్మెల్యేలు చెప్పే మాటలు అబద్ధమని పేర్కొన్నారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆయన జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ సర్పంచ్‌లు గెలుపొందిన గ్రామాలకు నిధులు ఇవ్వకుండా ఆ ఊర్లోకి ఎమ్మెల్యేలు అడుగు పెట్టగలరా? అంటూ ప్రశ్నించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో సైతం బీఆర్ఎస్ సత్తా చాటాలంటూ ప్రజలకు ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. గెలిచే అభ్యర్థులను బరిలో నిలబెట్టి కలిసికట్టుగా పని చేద్దామని పార్టీ కేడర్‌కు ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ జిల్లాకు రెండేళ్లలో ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదంటూ పెదవి విరిచారు.

మిగతా 2లో..



## స్పీకర్ తీర్పు రాజ్యాంగ విరుద్ధం

### హైకోర్టులో సవాల్ చేస్తాం: బిఆర్ఎస్

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

ఐదుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీర్పు రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందని, ఆయన నిర్ణయంపై హైకోర్టుకు వెళ్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కె.సంజయ్ తెలిపారు. ఇది స్పీకర్ నిర్ణయం కాదని, జూబ్లీహిల్స్ ప్యాలెస్ రాజు నిర్ణయమని విమర్శించారు.

మిగతా 2లో..

## తెలంగాణ విద్యా రంగ అభివృద్ధికి కేంద్ర మద్దతు కోరిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో

**విద్యా రంగంలో భారీ పెట్టుబడులపై కేంద్ర ఆర్థిక మంత్రితో భేటీ**



## పల్లె ప్రజల్లో కెసిఆర్ సిఎం కావాలన్న ఆకాంక్ష

### సర్పంచ్ ఎన్నికల ఫలితాలే నిదర్శనం: హరీష్ రావు

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

కేసీఆర్ సీఎం కావాలని.. బీఆర్ఎస్ మళ్లీ రావాలని ప్లలె ప్రజలు తీర్పునిచ్చారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయాని తెలిపారు. సిద్దిపేట జిల్లా నాంచారుపల్లి బీజేపీ సర్పంచ్ నరసింహారెడ్డి ఇవాళ బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు హరీశ్‌రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మిగతా 2లో..

## కొత్త డిస్కమ్ ఏర్పాటుకు ఆమోదం

## ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

విద్యుత్‌శాఖలో మరో విద్యుత్ పంపిణీ సంస్థ డిస్కంను ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మూడో డిస్కమ్‌కు సంబంధించిన మార్గదర్శకాలను బుధవారం విడుదల చేసింది. వ్యవసాయానికి, పేదల గృహాలకు 200 యూనిట్లు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాల నిర్వహణ, అలాగే ప్రభుత్వ విద్యుత్ రంగాన్ని సంస్కరించడం ఈ డిస్కం ముఖ్య ఉద్దేశం. ఇప్పటికే ఉన్న తెలంగాణ సదరన్, నార్తర్న్ డిస్కమ్‌లతో పాటు ఈ కొత్త డిస్కం పనిచేయనుంది. దీని వల్ల విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఆర్థిక స్థిరత్వం, సంక్షేమ పథకాల అమలును మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నారు.
కొత్త డిస్కమ్ ఏర్పాటుపై గతంలోనే కేబినేట్‌లో నిర్ణయించారు. దీనిద్వారా విద్యుత్ వినియోగాన్ని లెక్క కట్టాలని చూస్తున్నట్లు తెలుస్తోంది.





## భూపాలపల్లిలో కూలిన చెక్ డ్యామ్

మల్హార్ రావు మండలం వల్లెకుంట గ్రామ పరిసరాల్లో మానేరుపై నిర్మించిన చెక్ డ్యాం కొద్దిమేర కూలిపోయింది. 10 మీటర్ల మేర చెక్ డ్యాం గోడ కూలింది. ఫలితంగా నీరంతా దిగువకు వృథాగా పోతోంది. ఘటన జరిగిన సమయంలో చేపలు పడుతున్న ఇద్దరు మత్స్యకారులు ప్రవాహ ఉధృతికి కొద్దిదూరం కొట్టుకుపోయారు. తర్వాత ఈదుకుంటూ ఒడ్డుకు చేరడంతో వారికి ప్రాణాపాయం తప్పింది.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# స్పీకర్ ప్రసాద్ కుమార్ పంచతంత్రం



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):

ఎమ్మెల్యేలు పార్టీ మారానడానికి ఎలాంటి ఆధారాలు లేవు.. అందువల్ల వారిని అనర్హులగా ప్రకటించలేమని తెలంగాణ తెలంగాణ స్పీకర్ ప్రసాద్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంలో దాఖలైన పిటిషన్లపై స్పీకర్ ప్రసాద్‌కుమార్ తీర్పు వెలువరించారు. తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీపై దాఖలైన అనర్హత పిటిషన్లను కొట్టి వేస్తూ కీలక నిర్ణయం ప్రకటించారు. ఐదుగురు ఎమ్మెల్యేలు పార్టీ మారినట్టు ఆధారాలు చూపలేకపోయారని తీర్పులో పేర్కొన్నారు. అనర్హత వేటుకు తగిన ఆధారాలు లేవని, సాంకేతికంగా ఆ ఐదుగురు ఎమ్మెల్యేలు భారత రాష్ట్ర సమితిలోనే ఉన్నట్టు స్పష్టం చేశారు. మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లు దాఖలు చేయగా.. ఎనిమిది మందికి సంబంధించి విచారణ పూర్తి చేశారు. దానం నాగేందర్, కడియం శ్రీహరిపై దాఖలైన పిటిషన్లకు సంబంధించిన విచారణ ఇంకా పూర్తి కాలేదు. అనర్హత పిటిషన్లపై సభాపతి త్వరగా నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ పై ఈనెల 19న మరోమారు విచారణ జరగనుంది. ఎనిమిది మందికి సంబంధించి విచారణ పూర్తి చేసిన సభాపతి.. బుధవారం ఐదుగురికి సంబంధించి తీర్పు ఇచ్చారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలే యాదయ్య, సంజయ్ కుమార్‌కు సంబంధించి గరువారం తీర్పు వెలువడనుంది. రాష్ట్రంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అంశంపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కీలక తీర్పునిచ్చారు. ఐదుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టివేశారు. వారిపై అనర్హత వేటు వేసేందుకు తగిన ఆధారాలు లేవని స్పీకర్ గడ్డం ప్రసాద్ స్పష్టం చేశారు. పార్టీ మారినట్లు సరైన ఆధారాలు చూపలేదని తీర్పు సందర్భంగా స్పీకర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, కడియం శ్రీహరి, దానం నాగేందర్, కాలె యాదయ్య, పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎం సంజయ్ కుమార్ లు తమ పార్టీ తరఫున గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి మారారని, వారిపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు ఇచ్చారు. ఈ విషయంలో స్పీకర్ ఆలస్యం చేస్తుండటంతో.. బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వీరి పిటిషన్లపై పలు దఫాలుగా విచారించిన సుప్రీం ధర్మాసనం.. డిసెంబర్ 18వ తేదీలోగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు సూచించింది. సుప్రీంకోర్టు సూచన మేరకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్..బుధవారం ఐదుగురు ఎమ్మెల్యేల కేసులో తీర్పును వెలువరించారు.పార్టీ ఫిరాయింపుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేసిన పిటిషన్లను స్పీకర్ కొట్టేశారు. ఇక, మిగిలిన వారిలో ముగ్గురు ఎమ్మెల్యేలకు సంబంధించిన కేసులో గురువారం నాడు తీర్పు వెలువరించనున్నారు. మరో ఇద్దరు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలను ఇంకా విచారించాల్సి ఉంది. వీరికి స్పీకర్ నోటీసులు జారీ చేసినప్పటికీ.. ఎలాంటి రెస్పాన్స్ ఇవ్వలేదు. వీరి విషయంలో స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది సస్పెన్స్‌గా మారింది.

# తెలంగాణ పల్లెపోరులో కాంగ్రెస్ హవా



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ చాలా గట్టిగా పాతుకుపోయింది. దీనికి నిదర్శనమే తాజాగా జరిగిన పంచాయతీ ఎన్నికలు. మూడు దశల్లో జరిగిన పల్లెపోరులో కాంగ్రెస్ మద్దతుదారులే పైచేయి సాధించారు. మిగతా పార్టీ ఎక్కడా తమ దరిదాపుల్లో చేరుకోలేని అఖండ విజయాన్ని సొంతం చేసుకున్నారు. బుధవారం జరిగిన మూడో విడత ఎన్నికల పోలింగ్‌లో కాంగ్రెస్ మద్దతుదారుల హవా కొనసాగింది. మొత్తం 4,158 స్థానాల్లో ఎక్కువ చోట్ల గెలిచి ఆధిక్యాన్ని చాటారు. భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, జగిత్యాల, జయశంకర్ భూపాల్‌పల్లి, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, నాగర్ కర్నూల్, నల్లగొండ, నిజామాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, సంగారెడ్డి, సూర్యాపేట, వికారాబాద్, కామారెడ్డి, ఖమ్మం, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అత్యధిక స్థానాలను కాంగ్రెస్ మద్దతుదారులు గెలుపొందారు. కాంగ్రెస్ ఏకగ్రీవాలతో కలిపి మొత్తం 1850 స్థానాలు, బీఆర్ఎస్ 960, బీజేపీ 180, ఇతరులు 390 స్థానాల్లో విజయం సాధించారు.

మూడో దశ ఎన్నికల కోసం 182 మండలాల్లో మొత్తం 4,159 పంచాయతీలకు నోటిఫికేషన్ వెలువడింది. ఇందులో 11 సర్పంచ్ స్థానాలకు నామినేషన్లు దాఖలు కాలేదు. 394 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. ఇందులో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు 287 మంది, బీఆర్ఎస్ 42 మంది, బీజేపీ 9 మంది, ఇతరులు 57 ఉన్నారు.

రెండు పంచాయతీల్లో ఎన్నికలపై న్యాయస్థానం స్టే విధించింది. మిగిలిన 3,752 సర్పంచ్ స్థానాల్లో 12,652 మంది పోటీ చేశారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు పోలింగ్ కొనసాగింది. మధ్యాహ్నం 2 గంటల తర్వాత పోలింగ్ అధికారులు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభించారు. రాత్రి 8 గంటల వరకు ఓట్ల లెక్కింపు కొనసాగింది.

సర్పంచ్‌తో సీఎం సమావేశం..

కాంగ్రెస్ నుంచి గెలిచిన కొత్త సర్పంచులతో త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ కానున్నారు. తుది విడత పంచాయతీ ఎన్నికల తర్వాత ఈ నెల 22న సర్పంచుల ప్రమాణ స్వీకారం ఉంటుంది. తర్వాత హైదరాబాద్‌లో సర్పంచులతో సీఎం రేవంత్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలని నిర్ణయించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడం.. సంస్థాగతంగా కాంగ్రెస్ కేడర్‌ను బలోపేతం చేయడం వంటి అంశాలపై సర్పంచ్‌లకు సీఎం దిశానిర్దేశం చేయనున్నారు.

# తెలంగాణ విద్యా రంగ అభివృద్ధికి కేంద్ర మద్దతు కోరిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):

విద్యా రంగం అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు మద్దతుగా నిలవాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ గారికి ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి గారు విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో అత్యధిక సంఖ్యలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కేంద్ర మంత్రి గారికి వివరించారు.

- ముఖ్యమంత్రి గారు న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ గారితో పార్లమెంట్‌లోని వారి ఛాంబర్‌లో సమావేశమయ్యారు. తెలంగాణ వ్యాప్తంగా 105 శాసనసభ నియోజకవర్గాల్లో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల (YIIRS) ప్రాధాన్యతను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు వివరించారు.
- 5 నుంచి 12 తరగతుల వరకు ఉండే ఒక్కో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ (YIIRS)లో 2,560 మంది విద్యార్థులు ఉంటారని, మొత్తంగా 105 పాఠశాలతో 2.70 లక్షల మంది విద్యార్థులకు ప్రత్యక్షంగా నాణ్యమైన విద్యాబోధన లభిస్తుందని వివరించారు. YIIRSలు సమీప ప్రభుత్వ పాఠశాలలకు విద్యా హబ్‌లుగా ఉండడంతో పరోక్షంగా లక్షలాది మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని తెలియజేశారు.
- అత్యాధునిక వసతులు, లేబొరేటరీలు, స్టేడియాలతో నిర్మించే ఈ 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి రూ.21 వేల కోట్ల వ్యయమవుతుందని తెలిపారు. అలాగే, రాష్ట్రంలోని జూనియర్, డిగ్రీ, సాంకేతిక కళాశాలలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో ఆధునిక ల్యాబ్‌లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు మరో రూ.9 వేల కోట్లు వెచ్చించనున్నట్లు చెప్పారు.
- మొత్తంగా రాష్ట్రంలో విద్యా రంగం సమగ్రాభివృద్ధికి తమ ప్రభుత్వం రూ.30 వేల కోట్లు వెచ్చించినున్నట్లు ముఖ్యమంత్రి గారు కేంద్ర మంత్రి గారికి తెలిపారు. ఈ నిధుల సమీకరణకు ప్రత్యేక ప్రయోజన సంస్థ (SPC) ఏర్పాటు చేయనున్నామని, తద్వారా సేకరించే రుణాలకు ఎఫ్ఆర్‌బీఎం పరిమితి నుంచి మినహాయించాలని ముఖ్యమంత్రి గారు కోరారు. విద్యా రంగంపై ప్రభుత్వం చేస్తున్న వ్యయాన్ని మానవ వనరుల అభివృద్ధికి చేస్తున్న పెట్టుబడిగా భావించాలని కోరారు.
- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు, తెలంగాణలో విద్యా రంగం అభివృద్ధిపై ముఖ్యమంత్రి గారు చూపుతున్న చొరవను ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ గారు ప్రశంసించారు. YIIRS మోడల్ బాగుందన్న కేంద్ర మంత్రి గారు SPC కి సంబంధించిన వివరాలను అందజేయాలని సూచించారు.
- సమావేశంలో ముఖ్యమంత్రి గారితో పాటు ఎంపీలు మందాడి అనిల్ కుమార్ గారు, డాక్టర్ మల్లు రవి గారు, సురేశ్ షెట్కార్ గారు, చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు ఉన్నారు.

# పంచాయితీ ఎన్నికల్లో సింబల్ ఉంటే దుమ్ము రేగేది



మన జిల్లాకు అన్నం పెట్టేది పాలమూరు `రంగారెడ్డి ప్రాజెక్ట్ అని గుర్తు చేశారు. గత రెండేళ్లుగా ఈ ప్రాజెక్టును నిలిపేశావరంటూ రేవంత్ ప్రభుత్వంపై ఆయన నిప్పులు చెరిగారు.ఈ సన్మాన సభకు భారీ ఎత్తున కేడర్ రావడం బట్టి చూస్తే.. బీఆర్ఎస్ పార్టీకి పూర్వవైభవం రాబోతుందనడానికి ఇదే నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సభకు వచ్చిన క్యాడర్‌ను చూస్తే.. తన కడుపు నిండిపోయిందని చెప్పారు. ఈ ఎన్నికల్లో గెలుపొందిన వార్డు మెంబర్లు, సర్పంచ్‌లకు ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఓటమి పాలైన అభ్యర్థులు ఎవ్వరూ బాధపడ వద్దంటూ సూచించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక మీరే సర్పంచ్‌లుగా ఉంటారన్నారు. కాంగ్రెస్ పాలనలో ఎవ్వరు సంతోషంగా లేరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాను ముఖ్యమంత్రి అవుతానంటే.. జిల్లాలోని మొత్తం 12 స్థానాలను నుంచి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించారని గుర్తు చేశారు. కానీ ఈ జిల్లాకు సీఎం రేవంత్ చేసిందేమీ లేదన్నారు. పాలమూరు `రంగారెడ్డి ప్రాజెక్ట్ ముందుకు కదలడం లేదని తెలిపారు. సర్పంచ్ ఎన్నికల్లో పని చేసినట్టుగానే అసెంబ్లీ ఎన్నికల్లో పని చేయాల్సి ఉందంటూ కేడర్‌కు పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి అన్ని విధాలా కృషి చేద్దామని పార్టీ నేతలకు ఆయన సూచించారు.

# స్పీకర్ తీర్పు రాజ్యాంగ విరుద్ధం



(మొదటి పేజీ తరువాయి)

స్పీకర్‌ను ముఖ్యమంత్రి ఇబ్బంది పెడుతున్నారని సంజయ్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ప్యాలెస్ రాజు నుంచి ఎప్పుడో జడ్జిమెంట్ వచ్చిందని, ఆర్డర్ కాపీ జూబ్లీహిల్స్ ప్యాలెస్ నుంచి వచ్చిందని సంజయ్ విమర్శించారు. ట్రెజరీ బెంచ్‌కి టాయిలెట్ దగ్గరగా ఉంటుందని కాంగ్రెస్ వాళ్ళ పక్కన కూర్చున్నామని తమ ఎమ్మెల్యేలు చెబుతున్నారని సంజయ్ అన్నారు. 'మా వాదనలు పట్టించుకోకుండా ఏకపక్షంగా తీర్పునిచ్చారు. స్పీకర్ తీరు రాజ్యాంగానికి విరుద్ధంగా ఉంది. తీర్పు కాపీని అధ్యయనం చేసి హైకోర్టుకు వెళ్తామ'ని సంజయ్ తెలిపారు. ట్రిబ్యునల్ చైర్మన్ గా ఉన్న స్పీకర్ తీర్పును వ్యతిరేకిస్తున్నామని, స్పీకర్ రాజ్యాంగానికి, చట్టానికి లోబడి ఉండాలని ఎమ్మెల్యే వివేకానంద అన్నారు. స్పీకర్ పూర్తిగా విఫలమయ్యారని, స్పీకర్ తీర్పుపై జనాలు నవ్వుకుంటున్నారని, వ్యవస్థలపై ఉన్న నమ్మకం పోయిందని అన్నారు. ఎమ్మెల్యేలు పార్టీ మారితే ఉప ఎన్నికలు వస్తాయా అని సీఎం అన్నారని, తాజాగా స్పీకర్ జడ్జిమెంట్ కూడా సీఎం మాటలలాగానే ఉందని విమర్శించారు.

# పల్లె ప్రజల్లో కెసిఆర్ సిఎం కావాలన్న ఆకాంక్ష

(మొదటి పేజీ తరువాయి)

పెద్దకోడూరుకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు కూడా బీఆర్ఎస్‌లో చేరారు .ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. నమ్మకానికి, విశ్వాసానికి ప్రతీక కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ అని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ కపట నాటకాలకు సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టారని అన్నారు. బీజేపీది సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ కాదు.. అది సబ్‌కా బక్వాస్ అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి చీఫ్ మినిస్టర్ కాదు.. పేదల పథకాలకు ఎసరుపెట్టే కటింగ్ మాస్టర్ అని విమర్శించారు. మహిళలకు రూ.55 వేలు, వృద్ధులకు రూ.44 వేలు కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ పడిరదని తెలిపారు. సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారని అన్నారు.

# అసెంబ్లీ సాక్షిగా ప్రజాస్వామ్యం ఖూనీ

## ఫిరాయింపు ఎమ్మెల్యల తీర్పుపై కెటిఆర్

## రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారన్న హరీష్ రావు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):

ఐదుగురు ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇచ్చిన తీర్పును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండిరచారు. అసెంబ్లీ సాక్షిగా ఇవాళ ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ పార్టీ నిలువునా ఖూనీ చేసిందని విమర్శించారు. దేశ అత్యున్నత న్యాయస్థానాల పైనే కాదు.. చివరికి రాజ్యాంగంపై కూడా రాహుల్ గాంధీకి ఏమాత్రం గౌరవం లేదని మరోసారి తేలిపోయిందని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇంటికి వెళ్లి మరీ సీఎం రేవంత్ పార్టీ ఫిరాయింపులకు తెరతీసిన నాటి నుంచి నేటి స్పీకర్ నిర్ణయం వరకూ కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని అడుగడుగునా అపహాస్యం చేస్తూనే ఉందని కేటీఆర్ విమర్శించారు. అభివృద్ధి కోసం పార్టీ మారినట్టు సాక్షాత్తు ఫిరాయింపు ఎమ్మెల్యేలే అనేక సార్లు ప్రకటించినా వారిని కాపాడటం రాహుల్ రెండు నాల్కల ధోరణికి నిదర్శనమని అన్నారు. కేవలం ఫోటోలకు ఫోజులిచ్చేందుకు చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకుని తిరిగితే సరిపోదని.. తండ్రి చేసిన చట్టాన్నే గౌరవించలేని అసమర్థ నాయకుడిగా రాహుల్ గాంధీ చరిత్రలో మిగిలిపోతారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెండేళ్ల పాలనా వైఫల్యాలపై పంచాయతీ ఎన్నికల్లో పల్లెపల్లెనా వెల్లువెత్తుతున్న ప్రజావ్యతిరేకతకు భయపడే కాంగ్రెస్ పార్టీ బై ఎలక్షన్స్ అంటే జంకుతోందని కేటీఆర్ అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్య తీసుకోకుండా వెనకడుగు వేయడానికి ప్రధాన కారణం ఇదేనని తెలంగాణ సమాజానికి స్పష్టంగా అర్థమైపోయిందని విమర్శించారు. గోడ దూకిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను తాత్కాలికంగా కాపాడినట్టు కాంగ్రెస్ అనుకున్నా.. ప్రజాక్షేత్రంలో వారిని ఎమ్మెల్యే పదవికి అనర్హులుగా ఆయా నియోజకవర్గాల ప్రజలు ఎప్పుడో ప్రకటించేశారని తెలిపారు. ఈ వ్యవహారంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో రాజ్యాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కారని ఆరోపించారు. సేవ్ ది కానిస్టిట్యూషన్ అంటూ రాహుల్ గాంధీ ఢల్లీలో ఉపన్యాసాలు ఇస్తారని.. కానీ ఆచరణలో మాత్రం ఆ నినాదం మాటలకే పరిమితమైందని ఆరోపించారు. ఆచరణలో రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రజలు స్పష్టంగా గమనిస్తున్నారని చెప్పారు. ప్రజాస్వామ్య సూత్రాలను తీవ్రంగా దెబ్బతీసిన ఈ ఘటనలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడిరది. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో రాజ్యాంగం స్పష్టంగా నిర్దేశిరచిన యాంటీ`డిఫెక్షన్ నియమాలను పూర్తిగా పక్కన పెట్టి.. అధికార పార్టీకి అనుకూలంగా నిర్ణయం తీసుకోవడం. ఇది రాజ్యాంగాన్ని కాలరాయడమే. ఇది ఎంతో సిగ్గుచేటు. ప్రజాస్వామ్యానికి చెరగని మచ్చ అని అన్నారు. స్పీకర్ తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని మాజీ ఎంపి వినోద్ కుమార్ అన్నారు. స్వయంగా ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో అభివృద్ధి కోసం పార్టీ మారినట్లు చెప్పారు. కానీ ఇవాళ స్పీకర్ మాత్రం పార్టీ మారలేదు అని చెప్పడం ఎంత వరకు కరెక్ట్. 10వ షెడ్యూల్‌లో రాజ్యాంగ సవరణ చేయాలి. పార్లమెంట్‌లో వెంటనే పార్టీ ఫిరాయింపులపై ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు.

# కూరగాయల సాగులో ఆధునిక మెళకువలపై 3 రోజుల శిక్షణ ముగింపు





- ఇజ్రాయిల్ అగ్రికల్చర్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కార్యక్రమం

**మేడ్చల్–మల్కాజిగిరి, డిసెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** ఇజ్రాయిల్ అగ్రికల్చర్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా "కూరగాయల సాగులో మెళకువలు" అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమాన్ని ఉద్యానశాఖ జాయింట్ డైరెక్టర్ రామలక్ష్మి నిర్వహించారు.జీడిమెట్లలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ వెజిటెబుల్స్ అండ్ ఫ్లవర్స్లో జరిగిన ఈ శిక్షణా కార్యక్రమంలో ఇజ్రాయిల్‌కు చెందిన కూరగాయల సాగు నిపుణులు, ఇజ్రాయిల్ ఎంబస్సీ అగ్రికల్చర్ అటాచ్ మాషావ్ ఉరిరాబిన్ స్టీన్, డ్యానిల్ హదాద్ (ఎంబస్సీ ఆఫ్ ఇజ్రాయిల్), జిల్లా ఉద్యానశాఖాధికారి శ్రీధర్ పాల్గొన్నారు. అలాగే దేశంలోని 12 రాష్ట్రాల నుంచి వచ్చిన 40 మంది ఉద్యానశాఖ అధికారులు ఈ శిక్షణలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ రామలక్ష్మి మాట్లాడుతూ, నిపుణులు అందించిన ఆధునిక సాగు మెళకువలు రైతులకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. శిక్షణలో మట్టిరహిత కూరగాయల సాగు విధానాలు, బిందుసేద్యం ప్రాముఖ్యత, నీటిలో కరిగే ఎరువుల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారన్నారు.

అలాగే వాతావరణానికి అనుగుణంగా వంగడాల ఎంపిక, కూరగాయలు ఎక్కువ కాలం నిల్వ ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంట కోత అనంతరం పాటించాల్సిన పద్ధతులపై నిపుణులు వివరించారు. కూరగాయల పంటల్లో నులిపురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు, సలహాలు ఇచ్చారు.శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యానశాఖ అధికారులు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులకు సర్టిఫికెట్లు అందజేశారు.

# ఆశా వర్కర్లతో పారితోషికం లేని ఆన్లైన్ పనులు చేయించొద్దు

- బాలనగర్ పిహెచ్‌సీలో 7 మంది ఆశా వర్కర్ల జీతాలు వెంటనే చెల్లించాలి
- ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18,000 ఇవ్వాలి




**మేడ్చల్–మల్కాజ్‌గిరి, డిసెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు) :** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆశ వర్కర్లు మూడవ రోజు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు.ఆశా వర్కర్లతో పారితోషికం లేకుండా ఆన్లైన్ పనులు చేయించడం అన్యాయమని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్ -మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షురాలు డి. అనిత, కార్యదర్శి ఎం. రేవతి కళ్యాణి పేర్కొన్నారు. బాలనగర్ పిహెచ్‌సీలో పనిచేస్తున్న 7 మంది ఆశా వర్కర్లకు ఇప్పటికీ జీతాలు చెల్లించకపోవడం దారుణమని, వాటిని వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.ఎన్‌సీడీ, టీబీ వంటి ఆన్లైన్ ఎంట్రీలను వ్యక్తిగత సెల్‌ఫోన్లలో చేయించడంతో ఆశా వర్కర్లు మెడ, తల, కళ్ల నొప్పులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆశా విధులకు సంబంధం లేని ఆన్లైన్ పనులను చేయించవద్దని ప్రభుత్వాన్ని కోరారు.రోజుకు 8 గంటల పని చేయిస్తున్నప్పటికీ నెల జీతం ఇవ్వకపోవడం అన్యాయమని, ఉదయం 9 గంటలకు, మధ్యాహ్నం 4 గంటలకు అటెండెన్స్ తీసుకోవడం, ఆన్లైన్ లొకేషన్ పెట్టాలని ఒత్తిడి చేయడం సమంజసం కాదని విమర్శించారు. లక్షల రూపాయలు జీతాలు తీసుకునే ప్రభుత్వ ఉద్యోగులకు లేని నిబంధనలు ఆశా వర్కర్లపై మాత్రమే అమలు చేయడమేంటని ప్రశ్నించారు.ప్రతి నెల 6 ఏఎన్‌సీలు తీసుకురావాలని పెట్టిన టార్గెట్ల వల్ల పెర్ఫార్మెన్స్ సమయంలో అవమానాలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆశాలకు సంబంధం లేని పనులు చేయించడమే కాకుండా ఏఎస్సీలు, పిఎస్సీలు, ప్రభుత్వ డెలివరీలు వంటి టార్గెట్లు చేరలేదని పారితోషకం కోత పెట్టడం అన్యాయమన్నారు. ఈ టార్గెట్ విధానాన్ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.పెరుగుతున్న నిత్యావసర ధరలను దృష్టిలో పెట్టుకొని ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18,000 ఇవ్వాలని, లీవులు, యూనిఫార్ములు కల్పించాలని, స్పష్టమైన జాబ్ చార్ట్ ప్రకటించాలని, పని భారం తగ్గించాలని యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

# జిల్లా పరిషత్ భవనంలో అదనపు నిర్మాణాలపై అంచనాలు పంపాలని అధికారులకు ఆదేశం





- జిల్లా కలెక్టర్ మను చౌదరి

**మేడ్చల్–మల్కాజిగిరి, డిసెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ మండలంలో జిల్లా పరిషత్ సీఈఓ కార్యాలయ భవనాన్ని జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్, మండల తహసీల్దార్ కార్యాలయాలకు కేటాయించే అంశంపై జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు. బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తాతో కలిసి జిల్లా పరిషత్ సీఈఓ కార్యాలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ప్రస్తుతం ఉన్న జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా పరిషత్ భవనంలోని మొదటి అంతస్తులో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేయడం, పక్కనే ఉన్న ఎంపీడీఓ కార్యాలయాన్ని మండల తహసీల్దార్ కార్యాలయానికి కేటాయించే ప్రతిపాదనలను కలెక్టర్ పరిశీలించారు.అలాగే జిల్లా పరిషత్ కార్యాలయంలో ని రెండో అంతస్తు భవనంపై పైకప్పు స్లాబ్ నిర్మాణానికి అయ్యే వ్యయంపై అంచనాలు తయారు చేసి నివేదిక సమర్పించాలని పంచాయతీరాజ్ ఏఈను ఆదేశించారు. పక్కనే ఖాళీగా ఉన్న స్థలంలో జీ ప్లస్ వన్ కార్యాలయ భవన నిర్మాణానికి సంబంధించిన వ్యయ అంచనాల నివేదికను కూడా పంపాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సీఈఓ కాంతమ్మ కార్యాలయ గదులు, మీటింగ్ హాళ్లు, సమీపంలోని ఖాళీ స్థలాన్ని కలెక్టర్‌కు చూపించి వివరించారు. అనంతరం కలెక్టర్ శామీర్‌పేట్‌లోని ఎంపీడీఓ కార్యాలయాన్ని కూడా సందర్శించారు.

# ఉస్మానియా ఉద్యమ కెరటం గాదరి కిషోర్‌కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు

శాలువాతో సత్కరించి కేక్ కట్ చేసిన కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్





**హైదరాబాద్, డిసెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** బిఆర్ఎస్ పార్టీ తుంగతుర్తి నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు, ఉస్మానియా ఉద్యమ కెరటం గాదరి కిషోర్ అన్న జన్మదినాన్ని పురస్కరించుకొని చిల్కానగర్ డివిజన్ పరిధిలోని కళ్యాణపురిలో వారి నివాసంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ గాదరి కిషోర్‌ను శాలువాతో సత్కరించి, భారీ కేక్ కట్ చేయించారు. అనంతరం బాణాసంచా కాల్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి, కొకొండ జగన్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, బాలు తదితరులు పాల్గొని గాదరి కిషోర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఉస్మానియా ఉద్యమంలో ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా పలువురు గుర్తు చేసుకున్నారు.

# షాహీ ఎక్స్‌పోర్ట్స్ కార్మికుల ధర్నాకు కల్వకుంట్ల కవిత మద్దతు



**నాచారం, డిసెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** నాచారం లోని షాహీ ఎక్స్‌పోర్ట్ కంపెనీలో ధర్నా చేస్తున్న కార్మికులకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో కార్మికులు ఆమెను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, షాహీ ఎక్స్‌పోర్ట్స్‌లో మహిళా కార్మికులు చేస్తున్న ఆందోళన అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ధర్నాలో పాల్గొంటున్న మహిళలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా, వారి పోరాట స్ఫూర్తికి సెల్యూట్ చేస్తున్నానని తెలిపారు.15 రోజులుగా 2500 మంది మహిళా కార్మికులు రోడ్డుపై ఉన్నా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. లేబర్ కమిషనర్ స్పందించకపోవడం ఆశ్చర్యంగా ఉందని, లేబర్ మంత్రి వివేక్ వెంటనే ఈ అంశంపై ప్రోయాక్టివ్‌గా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.దాదాపు 9 ఏళ్లుగా కార్మికుల జీతాల్లో ఎలాంటి పెరుగుదల లేదని, ధరలు మాత్రం ఆకాశాన్ని అంటుతున్నాయని కవిత పేర్కొన్నారు. లేబర్ చట్టాలు అమలు కావడం లేదని, కరువు భత్యం కూడా ఇవ్వడం లేదని విమర్శించారు.రెండు మూడు రోజుల్లో ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. లేకపోతే మహిళా కార్మికులతో కలిసి తెలంగాణ జాగృతి పోరాటం చేస్తుందని హెచ్చరించారు. అవసరమైతే ఇతర కార్మిక నాయకులను కూడా రంగంలోకి తీసుకొస్తామని తెలిపారు. తన కొత్తగూడెం పర్యటన అనంతరం ఈ సమస్యపై ప్రత్యక్షంగా పోరాటం చేస్తానని కవిత స్పష్టం చేశారు.

# రవీంద్ర నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడికి శాల్వాతో ఎమ్మెల్యే సత్కారం



**నాచారం, డిసెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** నాచారం రవీంద్ర నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన బండల సత్యనారాయణను ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాలనీ అభివృద్ధిలో వెల్ఫేర్ అసోసియేషన్‌ల పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సంఘ నాయకులు ప్రజలతో పాటు ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన సంఘం నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కే. దామోదర్ రెడ్డి, మల్లేష్ యాదవ్, ఎం. దామోదర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, హనుమంత రెడ్డి, వెంకటేశ్వరులు, విఎన్ఎస్ శర్మ, ప్రశాంత్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# బేతుపల్లిలో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి ప్రభంజనం.!



**సత్తుపల్లి, డిసెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి మండలం బేతుపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా బరిలోకి దిగిన దొడ్డా రాజేంద్ర ప్రసాద్ (అమ్ములు) ఘన విజయాన్ని సాధించారు. అధికార కాంగ్రెస్ అభ్యర్థిని ఎదుర్కొని ఆయన 1100 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించడమే కాకుండా, గ్రామంలోని మొత్తం 12 వార్డులను తన పక్షాన కైవసం చేసుకోవడం ఎన్నికల ఫలితాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

పార్టీ టికెట్ లభించకపోయినా, ప్రజల మధ్య ఉండే నాయకుడిగా పేరుపొందిన రాజేంద్ర ప్రసాద్‌పై గ్రామ ప్రజలు అపార విశ్వాసం వ్యక్తం చేశారు. అభివృద్ధి, పారదర్శక పాలన, గ్రామ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సాగిన ప్రచారానికి ప్రజలు తమ ఓటుతో స్పష్టమైన మద్దతు పలికారు.

డబ్బు, పార్టీ ప్రభావాలకు లోబడకుండా స్వతంత్ర ఆలోచనతో ఓటు వేసిన బేతుపల్లి ప్రజలు ఈ ఎన్నికల్లో నిజాయితీ రాజకీయాలకు పట్టం కట్టినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఫలితం గ్రామ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారి తీస్తుందని, భవిష్యత్ స్థానిక సంస్థల ఎన్నికలపై కూడా ప్రభావం చూపే అవకాశముందని వారు పేర్కొంటున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# వరంగల్ జిల్లాలో భారీ ఇనుప ఖనిజ నిల్వల గుర్తింపుపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం

## వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

**న్యూ ఢిల్లీ,డిసెంబర్17(తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ జిల్లాలో ఉన్న ఇనుప ఖనిజ నిల్వలపై స్పష్టత ఇవ్వాలని, గనుల అభివృద్ధి, పర్యావరణ అనుమతులు, స్థానిక సంస్థలకు ఆదాయ భాగస్వామ్యం, గనుల భద్రతా తనిఖీల అంశాలపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు.

వరంగల్ జిల్లాలో సుమారు 40 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజ నిల్వలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో అంగీకరించినప్పటికీ, ఆ ఖనిజ సంపద ఆధారంగా అభివృద్ధి ఎందుకు ముందుకు సాగడం లేదని ఎంపీ లేవనెత్తారు.

ఈ ప్రశ్నకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి సమాధానంగా మాట్లాడుతూ, భారతీయ గనుల బ్యూరో రూపొందించిన జాతీయ ఖనిజ జాబితా ప్రకారం 2025 ఏప్రిల్ 1 నాటికి వరంగల్ జిల్లాలోని ఇనుప ఖనిజ నిల్వలు 'రిమైనింగ్ రిసోర్సెస్' విభాగంలో ఉన్నాయని తెలిపారు.

అయితే ఇప్పటివరకు వరంగల్ జిల్లాలో ఒక్క ప్రధాన ఖనిజ గని లీజు కూడా మంజూరు కాలేదని, ఒక్క ఖనిజ బ్లాక్ కూడా వేలం వేయలేదని వెల్లడైంది. దీంతో జిల్లాలో అపారమైన ఖనిజ సంపద ఉన్నప్పటికీ, ఉపాధి అవకాశాలు, స్థానిక అభివృద్ధి, గ్రామ పంచాయతీలకు ఆదాయం వంటి ప్రయోజనాలు ప్రజలకు అందని పరిస్థితి కొనసాగుతోందని ఎంపీ విమర్శించారు.

గనుల అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని, తెలంగాణ ప్రాంతాల పట్ల వివక్ష చూపుతోందని డా. కడియం కావ్య ఆరోపించారు. వరంగల్ వంటి వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని, ఖనిజ సంపదను ప్రజల సంక్షేమానికి ఉపయోగించే దిశగా తక్షణ చర్యలు చేపట్టాలని ఆమె కోరారు.







# ప్రశాంతంగా కొనసాగిన ఓట్ల పండుగ

- ఓటు హక్కును వినియోగించుకున్న ఓటర్లు
- పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు

**రాచకొండ, డిసెంబర్ 17 ( తెలంగాణ ముచ్చట్లు):** మూడో తుదివిడత స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. మంచాల మండలంలోని అఘపల్లి గ్రామంలో జరుగుతున్న పోలింగ్ సరళిని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు ఐపిఎస్ పరిశీలించారు.

ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద చేపట్టిన బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఎన్నికలు పూర్తి స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పోలింగ్ పూర్తయ్యి ఫలితాలు వెలువడే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

రాచకొండ పరిధిలో భువనగిరి నియోజకవర్గంలోని గుండాల, మోటకొండూరు, చౌటుప్పల్, నారాయణపూర్, మోత్కూర్, అడ్డగూడూరు, కందుకూరు, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, మాడ్గుల్, గ్రీన్ ఫార్మా, మాడ్గుల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు కొనసాగుతున్నాయని సీపీ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో బిఎన్ఎస్ 163 (144 సెక్షన్) అమలులో ఉందని వెల్లడించారు. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో నలుగురికి మించి గుమిగూడరాదని స్పష్టం చేశారు. చిన్న సంఘటన జరిగినా వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని పోలీసు సిబ్బందిని సీపీ సుధీర్ బాబు ఆదేశించారు.







# 16వ డివిజన్‌కు కుషాయిగూడ పేరు పెట్టాలి

**జోనల్ కమిషనర్‌కు అభ్యంతర పత్రం సమర్పించిన కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్**


**కుషాయిగూడ, డిసెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు)** : 16వ డివిజన్‌కు "కుషాయిగూడ" అనే పేరు కొనసాగించాలని కోరుతూ కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్ కార్యాలయంలో అభ్యంతర పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్ నాయకత్వం వహించారు. ఈ అభ్యంతరానికి మద్దతుగా సీసీఎస్ అధ్యక్షులు, శివసాయి నగర్ కాలనీ అధ్యక్షులు వెంపల్లి పద్మారెడ్డి, నాగార్జున నగర్ కాలనీ అధ్యక్షులు యావపురం రవి, సాయినగర్ కాలనీ అధ్యక్షులు సారా వినోద్ ముదిరాజ్, వైష్ణవి ఎంక్లేవ్ అధ్యక్షులు గంప కృష్ణ, ఇంద్రనగర్ కాలనీ మాజీ అధ్యక్షులు సారా అనిల్ ముదిరాజ్ తదితరులు వారి వారి కాలనీల తరపున అభ్యంతర పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ కోశాధికారి చిత్తుల కిషోర్ గౌడ్, జాయింట్ సెక్రటరీ నాలచెరువు జనార్ధన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పిట్ల రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొని తమ నిరసనను తెలియజేశారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని 16వ డివిజన్‌కు కుషాయిగూడ పేరును కొనసాగించాలని వారు అధికారులను కోరారు.

# గుండెనొప్పితో రైతు యాదయ్య మృతి

**సర్పంచ్ అనిత నర్సింహారావు నివాళులు**

**వేలేరు,డిసెంబర్17:(తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర గ్రామంలో గుండెనొప్పితో ఎడ్ల యాదయ్య (రైతు) మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన యాదయ్యకి అకస్మాత్తుగా గుండెనొప్పి రావడంతో హాస్పిటల్‌లో చేర్పించగా, చికిత్స పొందుతూ బుధవారం(డిసెంబర్ 17) మృతిచెందారు.

ఈ విషయం తెలుసుకున్న పీచర గ్రామ సర్పంచ్ మరిజె అనిత నర్సింహారావు మృతుని భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు,ఉపసర్పంచ్ గుడికందుల ప్రశాంత్, కొయ్యడ మహేందర్, కొలిపాక వెంకటేష్, గుడికందుల రాకేష్‌తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





# చర్లపల్లి డివిజన్ మార్పులపై కాప్రా సర్కిల్ డీసీకి వినతి



- బీఎన్ రెడ్డి నగర్,మహాలక్ష్మి నగర్, భరత్ నగర్‌లను చర్లపల్లి డివిజన్‌లోనే కొనసాగించాలి

**చర్లపల్లి, డిసెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** చర్లపల్లి డివిజన్ పరిధిలో ఉన్న బీఎన్ రెడ్డి నగర్, మహాలక్ష్మి నగర్, భరత్ నగర్ ప్రాంతాలను యథాతథంగా చర్లపల్లి డివిజన్‌లోనే కొనసాగించాలని అల్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజన అశాస్త్రీయంగా జరిగిందని ఆరోపిస్తూ కాప్రా సర్కిల్ డీసీ జగన్, డీసీపీ కృష్ణమోహన్‌లకు వినతిపత్రం అందజేశారు. గతంలో చర్లపల్లి డివిజన్ పరిధిలో ఉన్న ఈ ప్రాంతాలను నూతనంగా ఏర్పాటు చేసిన చక్రీపురం, శక్తి సాయి నగర్ డివిజన్లలో విలీనం చేయడం వల్ల ప్రజలకు పరిపాలనా పరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయని వారు వివరించారు.డివిజన్ మార్పుల కారణంగా మౌలిక సదుపాయాలు, ప్రజా సమస్యల పరిష్కారం ఆలస్యం అవుతున్నాయని పేర్కొంటూ, ఈ నిర్ణయాన్ని తక్షణమే పునఃపరిశీలించి సంబంధిత ప్రాంతాలను మళ్లీ చర్లపల్లి డివిజన్‌లో కొనసాగించాలని వినతిపత్రంలో కోరారు.ఈ కార్యక్రమంలో అల్ పార్టీ నాయకులు రుద్రగోని రాంచందర్ గౌడ్, బూడిద శ్రావణ్ కుమార్ గౌడ్, గడ్డం యాదగిరి, కొమ్ము నర్సింగ్ రావు, బిజ్జ ఆనంద్ రాజ్ గౌడ్, పల్లపు మల్లేష్, పి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సీఎం స్పెషల్ సెక్రెటరీని కలిసిన ఎమ్మెల్యే బండారి



**నాచారం, డిసెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న మౌలిక సదుపాయాల లోపాలను పరిష్కరించాలనే ఉద్దేశంతో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి ముఖ్యమంత్రి స్పెషల్ సెక్రెటరీ బి. అజిత్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదుల కొరత, ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని ఆయన వివరించారు. అలాగే కొన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించేందుకు వంట గదుల కొరత, మరికొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్ల సదుపాయాలు లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.అన్నపూర్ణ కాలనీలోని వెస్లీ హైస్కూల్ ఎయిడెడ్ పాఠశాలను పూర్తి స్థాయి ప్రభుత్వ పాఠశాలగా మార్పు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ పాఠశాల భవనం అనేక సంవత్సరాల క్రితం నిర్మించబడినదని, ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నందున ఆ భవనం స్థానంలో నూతన భవనాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.ఈ సమస్యలను ముందుగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు స్పెషల్ సెక్రెటరీని కలిసి పాఠశాలల అభివృద్ధికి సంబంధించిన అంశాలను వివరించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, బీఆర్ఎస్ పార్టీ కాప్రా డివిజన్ అధ్యక్షులు బైరి నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప పూజా కార్యక్రమంలో నెమలి అనిల్ కుమార్ పాల్గొన్నారు



**మల్లాపూర్, డిసెంబర్ 17 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం శక్తి సాయి నగర్ డివిజన్ పరిధిలోని చాణిక్యపురి కాలనీలో అనిల్ గురుస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప పూజా కార్యక్రమంలో గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన అయ్యప్ప స్వామిని ప్రార్థించి భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.కార్యక్రమం శాంతియుతంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో సాగింది.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
గురువారం - 18 - డిసెంబర్ 2025


# బీబీసీపై ట్రంప్ 10 బిలియన్ డాలర్ల దావా



బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్(బీబీసీ) సంస్థపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 10 బిలియన్ డాలర్ల(రూ.90వేల కోట్లు) పరువునష్టం దావావేశారు. అమెరికాలోని క్యాపిటల్ హిల్‌పై దాడి సందర్భంగా 2021లో తాను చేసిన వ్యాఖ్యలను తప్పు అర్థం వచ్చేలా ప్రసారం చేశారంటూ ఫ్లోరిడా కోర్టులో 33 పేజీల దావా వేశారు. శాంతియుత నిరసనలకు పిలుపునిచ్చిన తన ప్రసంగాన్ని బీబీసీ రెండుచోట్ల సవరించి ఉద్వేగభరితంగా మార్చిందని ట్రంప్ ఆరోపించారు. తన పరువుకు నష్టం కలిగించడంతో పాటు ఫ్లోరిడా చట్టాలను ఉల్లంఘించి అన్యాయమైన వ్యాపార విధానాలు పాటిస్తోందని అందులో వాదించారు. ఈ రెండు ఆరోపణలపై ఒక్కొక్కదానికి 5 బిలియన్ డాలర్ల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండు చేశారు. ‘తప్పుడు, మోసపూరిత, పరువునష్టం కలిగించే, రెచ్చగొట్టే, దురుద్దేశపూరితమైన చర్యలు’గా బీబీసీ పనోరమ డాక్యుమెంటరీని అభివర్ణించారు. 2024 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తనపై బురద జల్లాలనే ఉద్దేశంతోనే దీనిని ప్రసారం చేశారని ఆరోపించారు. కాగా...ఈ అంశంలో ఇప్పటికే బీబీసీకి ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ టిమ్ డేవీ, న్యూస్ చీఫ్ టర్నెస్ డెబోరా రాజీనామా చేశారు. గతనెలలో బీబీసీ ట్రంప్‌నకు క్షమాపణలు తెలియజేసింది. కానీ పరువునష్టం కలిగేలా వ్యవహరించలేదని పరిహారం డిమాండును తోసిపుచ్చింది. తాజా పరువునష్టం దావాపై స్పందించిన బీబీసీ ప్రతినిధి ..ఈ కేసుపై పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు.

# ఇరాన్ చర్యలకు మద్దతిస్తాం



అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ), పశ్చిమ దేశాలతో సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఇరాన్ చేపడుతున్న చర్యలకు మద్దతు ఇస్తామని రష్యా సోమవారం ప్రకటించింది. సోమవారం ఇరాన్ మీడియా సంస్థలతో రష్యా విదేశాంగమంత్రి సెర్గీలావ్‌రోవ్ మాట్లాడారు. ఐఏఈఏ ,సాధారణంగా పశ్చిమదేశాలతో దాని సంబందాలతో సహా సంక్షోభం నుంచి బయటపడేందుకు ఇరాన్ చేపడుతున్న చర్యలకు తాము మద్దతు తెలిపేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. అంతర్జాతీయ చట్టాన్ని బలహీనపరచడమే కాకుండా, ఇరాన్ అణు ఒప్పందం కూడా రాజీ పడిందని ఆయన పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్‌ఎస్‌సీ) ప్రకారం అన్ని పక్షాలు దీనిని అమలు పరచడానికి బాధ్యత వహిస్తాయని అన్నారు. రష్యా ఇరాన్‌తో ప్రస్తుత పరిస్థితిపై అధ్యక్ష స్థాయితో సహా వివిధ స్థాయిల్లో చర్చలు జరిపిందని అన్నారు. పరిస్థితిని ఎలా పరిష్కరించాలో, ఐఏఈఏ, పాశ్చాత్య దేశాలతో సంబంధాలను ఎలా పునరుద్ధ రించాలో వారు అభిప్రాయాలను పంచుకున్నారని అన్నారు. తుది నిర్ణయం ఇరాన్ ప్రభుత్వంపై ఆధారపడి ఉంటుందని అన్నారు. రష్యా, ఇరాన్ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని విస్తరించేందుకు తగిన సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని, ఈ ప్రక్రియను అన్ని విధాలా ప్రోత్సహించాలని ఆయన స్పష్టం చేశారు.

# ఎయిర్‌పోర్టు సమీపంలోనే కుప్పకూలిన విమానం



మెక్సికోలో పెను విషాదం చోటుచేసుకుంది. మెక్సికో సిటీకి పశ్చిమాన 50 కిలోమీటర్ల దూరంలో.. టోలుకా ఎయిర్‌పోర్టు సమీపంలోని శాన్ మాటియో అటెంకో అనే ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఒక చిన్న ప్రైవేట్ విమానం అత్యవసర ల్యాండింగ్‌కు ప్రయత్నిస్తూ కూలిపోయింది. మెక్సికో పసిఫిక్ తీరంలోని అకాపుల్కో నుంచి బయలుదేరిన ఈ మినీ ప్రైవేటు జెట్.. ప్రమాదంలో ఇద్దరు సిబ్బంది, 8 మంది ప్రయాణికులు సహా మొత్తం 10 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఇప్పటివరకు ఏడు మృతదేహాలను వెలికితీశారు.ఫుట్‌బాల్ గ్రౌండ్ సమీపంలో దిగేందుకు ఈ ఆ విమానం ప్రయత్నిస్తుండగా.. ఒక బిల్డింగ్ పైకప్పును ఢీకొట్టడంతో కుప్పకూలిపోయింది. దీంతో భారీ అగ్ని ప్రమాదం జరిగినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మంగళవారం రోజున మెక్సికోలోని టోలుకా విమానాశ్రయానికి దాదాపు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న శాన్ మాటియో అటెంకో పారిశ్రామిక ప్రాంతంలో ఈ విమాన ప్రమాదం జరిగినట్లు మెక్సికో స్టేట్ సివిల్ ప్రొటెక్షన్ కోఆర్డినేటర్ అడ్రియన్ హెర్నాండెజ్ తెలిపారు. అకాపుల్కో నుంచి బయలుదేరిన ఈ ప్రైవేట్ జెట్.. ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు ప్రయత్నించగా.. కుప్పకూలినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ప్రమాదం జరిగిన కొన్ని గంటల తర్వాత అందులో అగ్నికీలల నుంచి ఏడు మృతదేహాలను వెలికితీసినట్లు చెప్పారు. ఫుట్‌బాల్ మైదానంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు ప్రయత్నించగా.. అదుపు తప్పడంతోనే ఈ ఘటన చోటుచేసుకున్నట్లుగా పేర్కొన్నారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన అధికారులు.. ఆ ప్రాంతంలో సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని మూసివేసి దర్యాప్తును ప్రారంభించారు. ఈ మినీ జెట్ కింద పడిన వీడియో కూడా బయటకు వచ్చినట్లు మెక్సికో స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ విమాన ప్రమాదానికి దారితీసిన కచ్చితమైన కారణంపై అధికారులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయనున్నారు.

# ముచ్చటగా మూడోసారి ట్రంప్ కుమారుడి నిశ్చితార్థం



అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ తన వ్యక్తిగత జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. తన ప్రియురాలు, మోడల్, సామాజికవేత్త అయిన బెట్టినా ఆండర్సన్‌తో నిశ్చితార్థం చేసుకున్నట్లు ఆయన అధికారికంగా ప్రకటించారు.ఇప్పటికే రెండు సార్లు నిశ్చితార్థం చేసుకున్న ఈయనకు ఇది మూడో నిశ్చితార్థం కావడం గమనార్హం. అయితే ఈ శుభవార్తను ట్రంప్ జూనియర్ వైట్‌హౌస్‌లో నిర్వహించిన ప్రీక్రిస్మస్ వేడుకల సందర్భంగా తెలియజేశారు. ఈ వేడుకలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో పాటు అనేక మంది ప్రభుత్వ అధికారులు, ప్రముఖ రాజకీయ నాయకులు పాల్గొన్నారు. ట్రంప్ కుటుంబానికి క్రిస్మస్ పండుగ సందర్భంగా ఈ నిశ్చితార్థం ఒక తీపి కబురుగా మారింది. ట్రంప్ జూనియర్ గతంలో కూడా వివాహ జీవితాన్ని అనుభవించారు. 2005లో తొలిసారి ట్రంప్ జూనియర్ పెళ్లి చేసుకున్నారు. వెనెసా అనే అమ్మాయితో ఈయన వివాహం జర్గగా.. 13 ఏళ్ల పాటు సంతోషంగా గడిపారు. వీరి అన్యోన్య దాంపత్యానికి ప్రతీకలుగా మొత్తంగా ఐదుగురు పిల్లలు జన్మించారు. కానీ భార్యా భర్తల ఇద్దరి మధ్యా గొడవలు రావడంతో.. 2018లో విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి ఎవరి జీవితంలో వారు ముందుకు సాగుతున్నారు. భార్యతో విడిపోయిన రెండేళ్లకే ట్రంప్ జూనియర్ మరో అమ్మాయితో ప్రేమలో పడ్డారు. ముఖ్యంగా ఫాక్స్‌న్యూస్ మాజీ హోస్ట్ కింబర్లీతో కొన్నాళ్లు డేటింగ్ చేసి ఆపై పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈక్రమంలోనే 2020లో ఆమెతో నిశ్చితార్థం చేసుకున్నారు. కానీ ఆ తర్వాత వీరిద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో ఇద్దరూ ఒకరికొకరు బ్రేకప్ చెప్పేసుకుని.. నిశ్చితార్థాన్ని రద్దు చేసుకున్నారు. ఆ తర్వాత కొంత కాలానికే ట్రంప్ జూనియర్.. మరో అమ్మాయితో ప్రేమలో పడిపోయారు. ముఖ్యంగా మోడల్, సామాజికవేత్త అయిన బెట్టినా ఆండర్సన్‌తో ఈయన డేటింగ్ చేశారు. ఇందుకు సంబంధించి అనేక వార్తలు వచ్చాయి. వీరిద్దరూ కలిసి ఉన్న ఫొటోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈక్రమంలోనే వీరిద్దరూ పెళ్లి చేసుకుంటారనే ఊహాగానాలు వ్యక్తం అయ్యాయి.

# నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీకి షాకిచ్చిన కోర్టు



న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ కేసులో.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన తాజా ఎఫ్‌ఐఆర్‌పై విచారణను పరిగణనలోకి తీసుకోవడానికి ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు నిరాకరించింది.ఒక ప్రైవేట్ ఫిర్యాదు ఆధారంగా ఈడీ దర్యాప్తు జరిగిందే తప్ప.. ఎఫ్‌ఐఆర్ ఆధారంగా కాదని కోర్టు తేల్చి చెప్పింది. ఈ దశలో నిందితులైన కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీలకు ఆ ఎఫ్‌ఐఆర్ కాపీని ఇవ్వాల్సిన అవసరం లేదని కోర్టు వెల్లడించింది. అయితే ఈ కేసులో తదుపరి దర్యాప్తును కొనసాగించడానికి ఈడీకి అనుమతినిచ్చింది. నేషనల్ హెరాల్డ్ కేసులో ఢిల్లీ పోలీసుల ఆర్థిక నేరాల విభాగం నమోదు చేసిన తాజా ఎఫ్‌ఐఆర్‌కు సంబంధించిన విచారణపై అంగీకారం తెలిపేందుకు రౌస్ అవెన్యూ కోర్టు అంగీకరించలేదు. బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి దాఖలు చేసిన ఒక ప్రైవేట్ ఫిర్యాదు, మేజిస్ట్రేట్ సమన్ల ఆదేశాల ఆధారంగానే ఈడీ కేసు నమోదు చేసిందని.. ఎఫ్‌ఐఆర్ ఆధారంగా కాదని ఈ సందర్భంగా కోర్టు అభిప్రాయపడింది. కేసు విచారణ దశలో ఉండటంతో.. రాహుల్ గాంధీ , సోనియా గాంధీ సహా ఇతర నిందితులు ఎఫ్‌ఐఆర్ కాపీని పొందేందుకు అర్హులు కారని కోర్టు చెప్పింది. అయితే ఈడీ అధికారులు మాత్రం దర్యాప్తు కొనసాగించేందుకు రౌస్ అవెన్యూ కోర్టు అనుమతి ఇచ్చింది. ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో ఈడీపై, బీజేపీపై కాంగ్రెస్ పార్టీ ఘాటుగా స్పందించింది. తమ అగ్రనేతలపై ఈడీ చేపట్టిన చర్యలు రాజకీయ ప్రేరితమైనవవని.. అవి చట్టబద్ధంగా నిలబడలేనివని పేర్కొంది. ఈడీ చర్యలకు అధికార పరిధి లేదని కోర్టు గుర్తించిందని.. ఎందుకంటే అలాంటి విచారణలకు తప్పనిసరి అయిన ఎఫ్‌ఐఆర్ లేదని కాంగ్రెస్ వాదించింది.

# క్షమాపణ చెప్పను: పృథ్వీరాజ్ చవాన్



జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేసిన ఆపరేషన్ సిందూర్ గురించి మహారాష్ట్ర మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత పృథ్వీరాజ్ చవాన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. చవాన్ వ్యాఖ్యలను భాజపా తీవ్రంగా ఖండించింది. ఈ క్రమంలో తన వ్యాఖ్యలను సమర్థించుకుంటూ క్షమాపణలు చెప్పేది లేదని స్పష్టం చేశారు.పుణేలో విలేకరులతో మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ గురించి పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇవికాస్త రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. దీనిపై భాజపా జాతీయ అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్ మాట్లాడుతూ.. పృథ్వీరాజ్ చవాన్ పాకిస్థాన్ ప్రతినిధిలా మాట్లాడుతున్నారని విమర్శించారు. విజయ్ దివస్ నాడు మన సాయుధ దళాలను ఉద్దేశపూర్వకంగా దూషించి, వారిని రద్దు చేయాలంటూ వ్యాఖ్యానించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. చవాన్ వ్యాఖ్యలను కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా, రాహుల్ గాంధీలు ఎందుకు ఖండించలేదని, ఆయనపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా సైన్యంపై గతంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు మందలించిన విషయాన్ని ప్రస్తావించారు. చవాన్‌పై చర్యలు తీసుకోవాలని, ఆయన క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. భాజపా రాజ్యసభ ఎంపీ బ్రిజ్‌లాల్ కూడా చవాన్ వ్యాఖ్యలను ఖండించారు. కాంగ్రెస్ ఎప్పుడూ పాక్‌కు అనుకూలంగా వ్యాఖ్యలు చేస్తూ.. భారత్‌ను అవమానిస్తుందని విరుచుకుపడ్డారు. ఇక, భాజపా నేతల ప్రతిస్పందనల క్రమంలో చవాన్ తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. ‘ఇప్పుడు దీని గురించి నేను ఇంకేమీ చెప్పాలనుకోవడం లేదు.

# థాయ్‌లాండ్ నుంచి భారత్‌కు వచ్చిన లూత్రా సోదరులు



న్యూఢిల్లీ: గోవాలోని నైట్‌క్లబ్ అగ్నిప్రమాదం కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న క్లబ్ యజమానులు.. గౌరవ్, సౌరభ్ లూత్రాలకు ఎట్టకేలకు చుక్కెదురైంది. ప్రమాదం జరిగిన వెంటనే దేశం విడిచి పారిపోయిన ఈ సోదరులను భారత ప్రభుత్వం అభ్యర్థన మేరకు థాయ్‌లాండ్ పోలీసులు పట్టుకుని.. మంగళవారం రోజు భారత్‌కు పంపించారు. మధ్యాహ్నం 1.45 గంటలకు ఢిల్లీకి చేరుకున్న వీరిని పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. ఈనెల 6వ తేదీన అర్ధరాత్రి దాటిన తర్వాత గోవాలోని అర్పోరాలోని ‘బిర్చ్ బై రోమియో’ నైట్‌క్లబ్‌లో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘోర ప్రమాదంలో 25 మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన జరిగిన కొద్ది గంటల్లోనే క్లబ్ యజమానులైన లూత్రా సోదరులు ఇండిగో విమానంలో థాయ్‌లాండ్‌లోని పుకెట్‌కు పారిపోయినట్లు అధికారులు గుర్తించారు. గోవా పోలీసులు వెంటనే వారిపై కేసు నమోదు చేసి.. పాస్‌పోర్టులను రద్దు చేశారు. అలాగే ఇంటర్ పోల్ బ్లూ కార్నర్ నోటీసులను జారీ చేశారు. దీంతో విదేశాలలో వారి ప్రయాణం ఆగిపోయింది. భారత అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు థాయ్‌లాండ్ పోలీసులు ఇటీవల లూత్రా సోదరులను పుకెట్‌లో గుర్తించి అరెస్టు చేశారు. వారి గుర్తింపు, ప్రయాణ వివరాలను ధ్రువీకరించుకున్న తర్వాత.. అంటే మంగళవారం రోజు ఉదయం వారిని ఇండిగో విమానంలో భారత్‌కు డిపోర్ట్ చేశారు. ఈక్రమంలోనే మధ్యాహ్నం 1.45 గంటలకు ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న లూత్రా సోదరులను.. గోవా పోలీసులు వెంటనే కస్టడీలోకి తీసుకున్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కవితా ఉద్యమ శిల్పి గరిమెళ్ళ

అయన ఒక గొప్ప స్వాతంత్ర్య సమర యోధుడు. తన కవితలతో ఎందరినో స్వాతంత్ర్య పోరాటం పట్ల కార్యోన్ముఖులను చేసిన మార్గ దర్శకుడు. ఎందరికో మార్గదర్శకుడైన పోరాట యోధుడు. పరాయి పీడనకు, పాలనకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడి స్వేచ్ఛ, విముక్తి కోసం కలం పట్టి, గళమెత్తిన వీరసైనికుడు. ఇంకెందరిలోనో చైతన్య దీపాలను వెలిగించి, సత్యాగ్రహ బాట పట్టించిన స్ఫూర్తి ప్రదాత. నీతికీ నిజాయితీకి నిలువుటద్దం. దేశభక్తి గీతాలు రాసిన నేరానికి పలు మార్లు జైలు కెళ్ళినా, రాయడం మానని ధీరుడు. స్వాతంత్ర్యోద్యమంలో "వందే మాతరం" ఎలా నినాదంగా, ఉత్ప్రేరకంగా పని చేసిందో.. అలాగే ఆయన రాసిన "మా కొద్దీ తెల్ల దొరతనం" పాట ప్రతి తెలుగువారి నోటా మార్మోగింది. ఒక విప్లవ గీతమైంది. అలాంటి ప్రజాకవి గరిమెళ్ళ సత్యనారాయణ. తెలుగునాట జాతీయ కవిత్వానికి ఒరవడి పెట్టిన కవి ప్రముఖుడు గరిమెళ్ళ. సబర్మతీ ఆశ్రమంలో, గాంధీజీ ఈ పాటకు అనువాదము చేయించమని కోరినప్పుడు, ఇంగ్లీష్ లోకి అనువదించి టంగుటూరి ప్రకాశం పంతులు "స్వరాజ్యం" పత్రికలో ప్రచురించాడు. స్వాతంత్ర్యోద్యమ కవుల్లో గరిమెళ్ళ సత్యనారాయణది విశిష్ట, అగ్ర స్థానం. దేశభక్తి కవితలు వ్రాసి జైలుశిక్ష అనుభవించిన వారిలో ప్రథముడు గరిమెళ్ళ. అయన గేయాలు జాతీయ వీరరసంతో తొణికిసలాడుతూ పాఠక జనాన్ని ఉర్రూతలూగించాయి. 29 ఏళ్ళకే గేయాలు, రచనలు చేశాడు. స్వాతంత్ర్య పోరాటకాలంలో గరిమెళ్ళ గేయాలు బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా ప్రజా హృదయంలోకి శరవేగంగా చొచ్చుకు పోయాయి. స్వరాజ్య గీతాలు, గేయాలు, వ్యాసాలు పదునైన ఛలోక్తులకు ఆయనకు ఆయనే సాటి. గంజాం కలెక్టర్ కార్యాలయంలో గుమస్తా నుండి, విజయనగరం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా, ప్రియాగ్రహారంలో గ్రంథాలయ కార్యదర్శిగా, ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా, ఆచార్య రంగా, వాహిని పత్రికలో సహాయ సంపాదకునిగా, ఆనంద వాణికి సంపాదకునిగా ఏ విధులు నిర్వర్తించినా, నిజాయితీకి నిర్భీతికి నీతికి ప్రతీకగా నిలిచాడు. అయన రాసిన "మా కొద్దీ తెల్ల దొరతనం" .... " అలాగే "దండాలు దండాలు భారత మాత" అనే గీతం కూడా ప్రజలను ఎంతగానో జాగృతం చేసి స్వాతంత్ర్య ఉద్యమంలోకి ఉరికే తెగువను కలగ జేసింది. నిజాయితీకి, నిర్భీతికి గరిమెళ్ళ మారుపేరుగా నిలిచాడు. మాకొద్దీ తెల్ల దొరతనం పాట ఆనాడు ప్రతి తెలుగు వాడి నోటా మారు మోగేది. ఆయనంత ప్రసిద్ధినొందిన జాతీయకవి ఆ రోజుల్లో మరొకరులేరు. గరిమెళ్ళ సత్యనారాయణ శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట తాలుక గోనెపాడు గ్రామంలో 1893 జూలై 14న జన్మించాడు. తల్లి సూరమ్మ, తండ్రి వేంకట నరసింహం. గరిమెళ్ళ ప్రాథమిక విద్య స్వగ్రామమైన ప్రియాగ్రహారంలో సాగింది. విజయ నగరం, మచిలీ పట్నం, రాజమహేంద్ర వరం మొదలైనచోట్ల ఉన్నత చదువులు చదివాడు. బి.ఏ. చేశాక గంజాం కలెక్టర్ కార్యాలయంలో గుమస్తాగా కొంతకాలం పని చేశాడు. ఆ తరువాత విజయ నగరం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా కొంతకాలం పనిచేశాడు. అయన స్వేచ్ఛాప్రియత్వం వల్ల ఎక్కువకాలం ఏ ఉద్యోగమూ చెయ్యలేకపోయాడు. 1920 డిసెంబర్?లో కలకత్తాలో జరిగిన కాంగ్రెసు మహాసభలో సహాయ నిరాకరణ తీర్మానం అమోదించ బడింది. ఆ వీరావేశంతో ఉద్యమంలోకి దూకిన గరిమెళ్ళ ఉమా కొద్దీ తెల్లదొరతనం" పాటను రాశాడు. పాట సత్యాగ్రహులకు గొప్ప తెగువను, ఉత్తేజాన్ని కలిగించింది. ఆనాటి రోజుల్లో రాజమండ్రిలో ఈ పాట నకలు కాపీలు ఒక్కొక్కటి బేడా (12 పైసలు) చొప్పున అమ్ముడు పోయేవట. ఆనోటా ఈనోటా ఈ పాట గురించి ఆనాటి బ్రిటీషు కలెక్టరు బ్రేకన్ చెవినపడి ఆయన గరిమెళ్ళను పిలిపించి పాటను పూర్తిగా పాడమన్నాడట. గరిమెళ్ళ కేవలం రచయితే కాదు, గొప్ప గాయకుడు కూడా అయినందున తన కంచు కంఠంతో ఖంగున పాటలు కూడా పాడగా, గరెమెళ్ళ పాట విన్న బ్రిటీషు కలెక్టరు తెలుగుభాష తనకు రాకపోయి నప్పటికీ, ఈ పాటలో ఎంతటి మహత్తర శక్తి ఉందో, సామాన్య ప్రజల్ని సైతం ఎలా చైతన్యపరచ గలదో నేను ఊగించగల నన్నాడట. ఆ పాటను వ్రాసినందుకు గరిమెళ్ళకు ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష విధించారు. ఆ రోజుల్లో కాంగ్రెసు స్వచ్ఛంద సేవకులు ఖద్దరు దుస్తులు ధరించి, గాంధీటోపి పెట్టుకుని, బారులు తీరి మువ్వన్నెల జెండా ఎగరవేసుకుంటూ...మాకొద్దీ తెల్లదొరతనం దేవమాకొద్దీ తెల్లదొరతనం అంటూ ఆకాశం దద్దరిల్లేలా పాడుతూ వీధుల్లో కవాతు చేసేవారట. శిక్షపూర్తి చేసుకుని జైలు నుంచి విడుదల అయిన గరిమెళ్ళ మళ్ళీ ప్రజల మధ్య గొంతెత్తి పాడసాగాడు. ప్రజల్ని ఎంతగానో ఆకట్టుకో సాగాడు. ఇది చూసి ప్రభుత్వాధికారులు భయపడ్డారు. గరిమెళ్ళ బయట వుండటం ప్రభుత్వాధికారులు భయపడ్డారు. గరిమెళ్ళ బయట వుండటం ప్రభుత్వానికి మంచిది కాదని భావించి ఆయనను అరెస్టు చేశారు. కాకినాడ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచారు. మేజిస్ట్రేట్ రెండు సంవత్సరములు కఠిన కారాగార శిక్ష విధించాడు. గరిమెళ్ళ జైలులో వుండగా 1923 జనవరిలో ఆయన తండ్రి చనిపోయాడు. క్షమాపణ చెబితే విడుదల చేస్తామని చెప్పారట. కాని గరిమెళ్ళ క్షమాపణ చెప్పకుండా జైలులోనే ఉన్నాడు. అంతటి దేశభక్తుడు ఆయన. జైలు నుంచి విడుదల కాగానే ప్రజలు ఆయనకు ఎన్నోచోట్ల సన్మానాలు చేశారు. ఆయన జీవితంలో మధుర ఘట్టం ఇదొక్కటే. అప్పులు పెరగడంతో ఉన్న ఆస్తి అమ్మేసి అప్పులు తీర్చాడు. ఉద్యోగం వదిలేశాక కొంతకాలం ప్రియాగ్రహారంలో గ్రంథాలయ కార్యదర్శిగా పనిచేశాడు. శ్రీ శారదా గ్రంథమాల స్థాపించి పద్దెనిమిది పుస్తకాలు అచ్చువేశాడు. అవి అమ్ముడుపోలేదు. ఆయన ఎక్కువగా రాజమండ్రి, విజయవాడ, మద్రాసులకు తిరుగుతూ వుండడంతో, పట్టించు కోక పోవడం వల్ల వాటిని చెదలు తినేశాయి. వాటి వల్ల కూడా కొంత నష్టం వచ్చింది. 1921లో గరిమెళ్ళ 'స్వరాజ్య గీతములు 'పుస్తకం వెలువడింది. 1923లో హరిజనుల పాటలు, 1926లో ఖండకావ్యములు, భక్తిగీతాలు, బాలగీతాలు మొదలైన రచనలు వెలువడ్డాయి. గరిమెళ్ళ చాలాసార్లు జైలు శిక్ష అనుభవించాడు. జైలులో వుండగా తమిళ, కన్నడ భాషలు నేర్చుకున్నాడు. తమిళ, కన్నడ గ్రంథాలను తెలుగులోకి అనువ దించాడు. ఆంగ్లంలో కూడా గరిమెళ్ళ కొన్ని రచనలు చేశాడు. ఆంగ్లం నుంచి కొన్ని గ్రంథాలను తెలుగులోకి అనువదించాడు. భోగరాజు పట్టాభిసీతారామయ్య ఆంగ్లంలో వ్రాసిన ' ది ఎకనామిక్ కాంక్వెస్ట్ ఆఫ్ ఇండియా' అనే గ్రంథాన్ని తెలుగులోకి అనువదించాడు. 1937లో చీనాజపాన్ అనే పుస్తకాన్ని రచించారు. గరిమెళ్ళ జీవనోపాధి కోసం 1933లో మద్రాసు చేరుకున్నాడు. అక్కడ గృహలక్ష్మి పత్రిక సంపాదకుడుగా ఉద్యోగంలో చేరాడు. కొంతకాలం తరువాత అక్కడ మానివేసి ఆచార్య రంగా, వాహిని పత్రికలో సహాయ సంపాదకుడుగా చేరాడు. కొద్ది రోజులతర్వాత ఆంధ్రప్రభలో చేరాడు. కొంతకాలం ఆనందవాణికి సంపాదకుడుగా పనిచేశాడు. కొంతకాలం ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా జీవనం సాగించాడు. స్వాతంత్ర్యానంతరం పాలకుల వల్ల కూడా గరిమెళ్ళకు చెప్పుకో తగిన సహాయం లభించలేదు. దాంతో కొంతమంది మిత్రులు గరిమెళ్ళను ' మాకొద్దీ నల్ల దొరతనం ' అనే గేయం రాయమని అడిగారట. దేశ భక్తుడు, స్వాతంత్ర్య పిపాసి అయిన గరిమెళ్ళ అందుకు అంగీకరించలేదట. గరిమెళ్ళ పేదరికం అనుభవిస్తున్న రోజుల్లో దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు కొంత సహాయ పడ్డాడు. వావిళ్ళ వేంకటేశ్వర శాస్త్రులు ప్రతినెలా ఆయనకు ఆర్థిక సహాయం చేసేవాడు. వివిధ పత్రికలకు, ఆలిండియా రేడియోకి రచనలు చేసి కొంత గడిస్తున్నా ఆయన అవసరాలకు ఆ డబ్బు చాలలేదు. ఒకవైపు పేదరికం, మరోవైపు అనారోగ్యం ఆయనను బాగా దెబ్బతీశాయి. చివరిదశలో ఒక కన్ను పోయింది. పక్షవాతం వచ్చింది. దిక్కులేని పరిస్థితుల్లో కొంతకాలం యాచన మీద బ్రతికాడు. జీవిత చరమాంక దశలో దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించిన గరిమెళ్ళ 1952 డిసెంబర్ 18వ తేదీన స్వగ్రామంలో మరణించాడు. పాలకుల తీరుపై పోరు సాగించిన యోధుడుగా గరిమెళ్ళ చరిత్రలో మిగిలి పోయాడు.



## స్థిరాస్తి రంగంలో 7.3 శాతం వృద్ధి

దేశంలో సొంతింటి కొనుగోలు చేస్తున్న వారి సంఖ్య పెరుగుతోందని, ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ రంగంలో 6.5 7.3% వరకూ వృద్ధి కనిపించే అవకాశం ఉందని బ్రిక్‌వర్క్ రేటింగ్స్ అంచనా వేసింది. వడ్డీ రేట్లు తగ్గుతుండటం, ప్రజల వద్ద మిగులు మొత్తం పెరుగుతుండటం కలిసొస్తోందని బ్రిక్‌వర్క్ సీఈఓ మను సెహగల్ తెలిపారు. జీడీపీ వృద్ధి దాదాపు 8.2 శాతంగా ఉందని, ద్రవ్యోల్బణం నియంత్రణ స్థాయిలో ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్ సహా విశాఖపట్నం, అమరావతి ప్రాంతాల్లో నివాస గృహాల మార్కెట్ వృద్ధి చెందుతోందని బ్రిక్‌వర్క్ చీఫ్ రేటింగ్ ఆఫీసర్ కె.హెచ్.పట్నాయక్ అన్నారు. జీఎహెచ్ఎంసీ విస్తరణ, గ్లోబల్ రైజింగ్ సమిట్‌లాంటివి ఇక్కడ పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ రియల్ ఎస్టేట్ మంచి పనితీరు కనబరుస్తోందని వివరించారు. గూగుల్ వంటి సంస్థలు రావడమే ఇందుకు కారణమని తెలిపారు. రూ.25 కోట్లకు మించి రుణాలు తీసుకునే స్తిరాస్తి, ప్రభుత్వ సంస్థలకు తాము రేటింగ్ అందిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో ఐటీ, ఫార్మా రంగాల వృద్ధి నేపథ్యంలో వాణిజ్య స్తిరాస్తికి గిరాకీ కనిపిస్తోందన్నారు. 2034 నాటికి తెలంగాణ 1 ట్రిలియన్ డాలర్ల వృద్ధిని సాధించాలంటే.. 1213 శాతం వృద్ధిని సాధించాల్సిన అవసరం ఉందని బ్రిక్‌వర్క్ రేటింగ్స్ అంచనా వేసింది.

## 134 కోట్ల మంది ఆధార్ డేటా సేఫ్.. పార్లమెంట్‌కు తెలిపిన కేంద్రం

భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (UIDAI) డేటా బేస్ నుంచి ఆధార్‌కార్డు హోల్డర్ల డేటా దుర్వినియోగం జరగలేదని కేంద్రం స్పష్టం చేసింది. అధునాతన భద్రతా చర్యల కారణంగా పౌరుల ఆధార్ డేటా సురక్షితంగా ఉందని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌కు వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. "ప్రపంచంలోనే అతిపెద్ద బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థ అయిన ఉడాయ్‌లో సుమారు 134 కోట్ల మంది ఆధార్ హోల్డర్లు ఉన్నారు. ఇప్పటి వరకు 16వేల కోట్ల అథంటికేషన్ లావాదేవీలు జరిగాయి" అని కేంద్రమంత్రి తన సమాధానంలో వెల్లడించారు. బలమైన సాంకేతిక, సంస్థాగత భద్రతా చర్యల కారణంగా ఆధార్ డేటా సురక్షితంగా ఉందని తెలిపారు. ఆధార్ డేటా భద్రతకు ఉడాయ్.. డిఫెన్స్ ఇన్ డెప్త్ విధానాన్ని అనుసరిస్తూ బహుళ అంచెల భద్రతా వ్యవస్థను అమలు చేస్తోందన్నారు. ఇందులో ఒక లేయర్ దెబ్బతిన్నా.. మిగిలినవి డేటాకు రక్షణ కల్పిస్తాయని చెప్పారు. ఆధార్ డేటా బదిలీ, స్టోరేజీ సమయంలో అధునాతన ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. నేషనల్ క్రిటికల్ ఇన్ఫర్మేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొటెక్షన్ సెంటర్ (NCIIPC) పర్యవేక్షణలో ఆధార్ వ్యవస్థ సురక్షితంగా ఉందని తెలిపారు. ఇది ఎప్పటికప్పుడు ఆధార్ సైబర్ సెక్యూరిటీకి సంబంధించి సూచనలు చేస్తుంటుందని పేర్కొన్నారు. దీనికితోడు స్వతంత్ర ఆడిట్ ఏజెన్సీలు కూడా ఆధార్ ఎకోసిస్టమ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు.

## బాక్సైట్ తవ్వకాలు కార్పొరేట్లకే..

దేశంలో బాక్సైట్ నిక్షేపాలు ఉన్నా, అవసరాల రీత్యా దేశం లోకి దిగుమతి అవుతున్నది. ముఖ్యంగా చైనా, రష్యా, యుఎఇ, ఇతర దేశాల నుంచి బాక్సైట్ లేదా అల్యూమినా దిగుమతి జరుగుతున్నది. ఫలితంగా దేశ పరిశ్రమాధిపతులు తమ లాభాలు తగ్గుతాయని ఆందోళన చెందుతున్నారు. ఆ ఆందోళనలో భాగమే, దేశీయ పరిశ్రమలను కాపాడాలంటూ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ మినరల్ ఇండస్ట్రీస్ (ఫెమి) కేంద్ర ఆర్థిక శాఖను కోరింది. 2025 26 ఆర్థిక సంవత్సరం అల్యూ మినియం డిమాండ్‌లో 55% దిగుమతులతోనే భర్తీ అయ్యే పరిస్థితి ఉన్నట్లు ఆర్థిక శాఖకు తెలిపింది. ప్రాథమిక అల్యూమినియంతోపాటు అల్యూమినియం డేన్ స్ట్రీమ్ ఉత్పత్తుల (షీట్లు, ఫాయిల్స్, రాడ్లు) దిగుమతులపై ప్రస్తుతం ఉన్న 7.5% నుంచి 15% సుంకం విధించాలని ఆర్థిక శాఖను కోరింది. అల్యూమినియం సెకండరీ మాన్యుఫ్యాక్టర్స్ అసోషియేషన్ (ఎఎస్ఎంఎ) మాత్రం ప్రైమరీ అల్యూమినాపై దిగుమతి సుంకాన్ని తగ్గించాలని కోరింది. భారతదేశంలో బాక్సైట్ అపారంగా ఉంది. 3 వేల మిలియన్ టన్నుల నిల్వలతో, ప్రపంచంలోనే ఎక్కువ నిల్వలు ఉన్న దేశాల్లో 5వ స్థానంలో ఉంది. ఒడిశా, చత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, గుజరాత్ మొదలైన రాష్ట్రాల్లో బాక్సైట్ నిక్షేపాలు ఉన్నాయి. ఒడిశా రాష్ట్రంలోనే 51% పైగా బాక్సైట్ ఉంది. అల్యూమినియం ఉత్పత్తిలో బాక్సైట్ కీలకం. బాక్సైట్ నుంచి అల్యూమినా ముడి పదార్థం తయారు అవుతుంది. అల్యూమినా ద్వారా అల్యూమినియం తయారు చేస్తారు. భారతదేశంలో తయారయ్యే ఉత్పత్తిలో దాదాపు 40% అమెరికాకు ఎగుమతి జరుగుతున్నది. భారతదేశ అల్యూమినియం అమెరికాకు అగ్ర మార్కెట్ ఉంది. 2023లో భారత అల్యూమినియం మార్కెట్ విలువ 11.29 మిలియన్ల అమెరికా డాలర్లు. ఇది భారత జిడిపిలో 2% గా ఉంది. అల్యూమినియంకు ప్రపంచంలో మంచి డిమాండ్ ఉంది. దీన్ని విమానాల తయారీలోనూ, పరిశ్రమలు, ప్యాక్ జింగ్, ఆటోమొబైల్స్, ఎలక్ట్రానిక్ వంటి వాటి తయారీలో వాడతారు. బాక్సైట్‌ను ప్రధానంగా ఆస్ట్రేలియా, చైనా, గినియా, బ్రెజిల్, భారత్ దేశాలతోపాటు ఇండోనేషియా, రష్యా, జమైకా, కజకిస్తాన్, వియత్నాం తదితర దేశాలు ఉత్పత్తి చేస్తున్నాయి. ప్రపంచంలో ఆల్కొవా, రియో టెంట్, హైడ్రా, ఎస్ఎంబి విన్నింగ్ కన్సార్టియం, అల్యూమినియం కార్పొరేషన్ ఆఫ్ చైనా, కంపెనీ డెస్ బాక్సైట్ గినియా, భారత్ అల్యూమినియం కంపెనీ, రామిన్ మైనింగ్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లు పెద్ద మైనింగ్ కంపెనీలు. భారతదేశంలో హిందూస్తాన్ అల్యూమినియం కంపెనీ, వేదాంత లిమిటెడ్, ఇండియా ఫాయిల్స్ లిమిటెడ్, సచేటా మెటల్స్, జిందాల్ అల్యూమినియం, నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్, భారత్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్, మద్రాస్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్, ఇండియన్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్, సెంచరీ ఎక్స్‌ట్రూషన్స్ లిమిటెడ్ అల్యూమినియం కంపెనీలు ఉత్పత్తి కంపెనీలుగా ఉన్నాయి. అల్యూమినియం ధరలు బాగా పెరగడంతో ప్రపంచ కంపెనీలతో పాటు, భారత కంపెనీలకు పెద్ద ఎత్తున లాభాలు వస్తున్నాయి. ఆదిత్య బిర్లాకు చెందిన ఫ్లాగ్ షిప్ మెటల్ కంపెనీ ప్రపంచం లోనే అతిపెద్ద అల్యూమినియం కంపెనీల్లో ఒకటి. దీని ఆదాయం 28 బిలియన్ డాలర్లుగా ఉంది. కాఫర్, స్పెషాల్టీ అల్యూమినా లో కూడా ఈ కంపెనీ బలంగా ఉంది. పది దేశాల్లో 48 ఫ్యాక్టరీలు కలిగి ఉంది. గత మూడు సంవత్సరాల్లో దీని అమ్మకాలు 69 శాతానికి పెరిగి లాభాలు 4.1% ఉన్నాయి. వేదాంత అనుబంధ సంస్థ అయిన వేదాంత అల్యూమినియం భారత్ అతిపెద్ద, ప్రపంచంలో టాప్ అల్యూమినియం కంపెనీల్లో ఉంది. 2025లో భారత్ మొత్తం అల్యూమినియం ఉత్పత్తిలో సగం ఉత్పత్తి దీని నుంచే ఉంది. ఆ సంవత్సరం 2.42 మిలియన్ టన్నుల ఉత్పత్తి చేసింది. గత మూడు సంవత్సరాల్లో అమ్మకాలు 4.8% పెరిగాయి. నాల్కొ ఇది నవరత్న హోదా కలిగిన ప్రభుత్వ కంపెనీ. బాక్సైట్ మైనింగ్, అల్యూమినా, అల్యూమినియంకి సంబంధించిన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. దీని బాక్సైట్ కెపాసిటీ సామర్థ్యం ఏడాదికి 68 లక్షల టన్నులుగా ఉంది. అల్యూమినా సామర్థ్యం 21 లక్షల టన్నులుగా ఉంది. 2025లో దీని నికర లాభం 158% పెరిగి రూ. 52,679 కోట్లకు చేరిందని, సంపద 1,67,876 కోట్లకు పెరిగింది. దేశంలో బాక్సైట్ నిక్షేపాలు ఉన్నా, అవసరాల రీత్యా దేశం లోకి దిగుమతి అవుతున్నది. ముఖ్యంగా చైనా, రష్యా, యుఎఇ, ఇతర దేశాల నుంచి బాక్సైట్ లేదా అల్యూమినా దిగుమతి జరుగుతున్నది. ఫలితంగా దేశ పరిశ్రమాధిపతులు తమ లాభాలు తగ్గుతాయని ఆందోళన చెందుతున్నారు. ఆ ఆందోళనలో భాగమే, దేశీయ పరిశ్రమలను కాపాడాలంటూ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ మినరల్ ఇండస్ట్రీస్ (ఫెమి) కేంద్ర ఆర్థిక శాఖను కోరింది. 2025 26 ఆర్థిక సంవత్సరం అల్యూమినియం డిమాండ్‌లో 55% దిగుమతులతోనే భర్తీ అయ్యే పరిస్థితి ఉన్నట్లు ఆర్థిక శాఖకు తెలిపింది. ప్రాథమిక అల్యూమినియంతోపాటు అల్యూమినియం డేన్ స్ట్రీమ్ ఉత్పత్తుల (షీట్లు, ఫాయిల్స్, రాడ్లు) దిగుమతులపై ప్రస్తుతం ఉన్న 7.5% నుంచి 15% సుంకం విధించాలని ఆర్థిక శాఖను కోరింది. అల్యూమినియం సెకండరీ మాన్యుఫ్యాక్టర్స్ అసోషియేషన్ (ఎఎస్ఎంఎ) మాత్రం ప్రైమరీ అల్యూమినాపై దిగుమతి సుంకాన్ని తగ్గించాలని కోరింది. దేశంలో అల్యూమినియం ధరల స్థిరీకరించడానికి, అధిక ఇన్‌పుట్ ఖర్చులతో ఇబ్బందిపడుతున్న దిగువ స్థాయి పరిశ్రమలకు అవసరమైన ఉపశమనం అందించడానికి ప్రైమరీ అల్యూమినాపై దిగుమతి సుంకాన్ని తగ్గించమని తెలిపింది. ఇది బడా పరిశ్రమలు, చిన్న పరిశ్రమల మధ్య ఉన్న వైరుధ్యాన్ని తెలియ చేస్తున్నది. బడా పరిశ్రమల వల్ల చిన్న పరిశ్రమలు నష్ట పోతున్న విషయాన్ని ఇది పరోక్షంగా తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో 600 మిలియన్ టన్నుల బాక్సైట్ ఉంది. జియో లాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకారం దేశం మొత్తం నిల్వల్లో ఇది 21%. ఇందులో విశాఖపట్నం తూర్పు కనుముల్లోనే ఎక్కువగా ఉంది. 2000 సంవత్సరంలో తెలుగుదేశం పార్టీ పాలనలో రాష్ట్రంలోని బాక్సైట్ వనరులను బయటకు తీసేందుకు ప్రణాళికలు రూపొందించింది. అప్పటి నుండి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గిరిజన ప్రజల భూహక్కులను, షెడ్యూల్డ్ ప్రాంతం లో రాజ్యాంగ రక్షణను నియంత్రించే చట్టాలకు సవరణలు చేయడానికి పూనుకుని, గిరిజనులు, గిరిజన సంఘాల తీవ్ర వ్యతిరేకత వల్ల ఆ ప్రయత్నాలను విరమించుకున్నారు. 2004లో అధికారంలోకి వచ్చిన ఆనాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం బాక్సైట్‌ను తవ్వే పనిని చేపట్టింది. 2005లో జెఎస్‌డబ్లు హెచ్‌ఎల్‌తో, తదుపరి 2007లో రస్ ఆల్ కైమాతో ఒప్పందం కుదుర్చుకున్నది. 1997లో సుప్రీం కోర్టు సమతా తీర్పు ప్రకారం రాష్ట్రంలోని షెడ్యూల్డ్ ప్రాంతంలో గనులు లేదా పరిశ్రమలకోసం ఏ ప్రైవేట్ కంపెనీ భూమిని స్వాధీనం చేసుకోకుండా లేదా లీజుకు ఇవ్వకుండా నిరోధించడం వల్ల రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం మోస పూరితంగా తవ్వకాలను చేపట్టింది. ప్రభుత్వ సంస్థ అయిన ఆం.ప్ర ఖనిజాభివృద్ధి (ఎపిఎండిసి) సంస్థ బాక్సైట్ ని తవ్వుతుంది. దాన్ని ప్రభుత్వం రస్ ఆల్ కైమాకి సరఫరా చేస్తుంది. ఆ సంస్థకు 11 వందల ఎకరాలకు పైగా భూమిని కేటాయించింది. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా గిరిజనులు, ప్రజా సంఘాలు పెద్దఎత్తున ఆందోళన చేశాయి. ఆ నేపథ్యంలో ఎన్నికలు రావడంతో బాక్సైట్ తవ్వకాలు ఆగిపోయింది. వైసిపి ప్రభుత్వం 2020 డిసెంబర్ లో జిఒ 89 విడుదల చేసి, బాక్సైట్ తవ్వకాలు చేసేందుకు ప్రయత్నించగా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీవ్ర నిరసనలు కొనసాగాయి. తెలంగాణ రాష్ట్రంలో ఇతర రాష్ట్రాల కన్నా చాలా తక్కువ బాక్సైట్ నిల్వలు ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో బాక్సైట్ అన్వేషణ కొనసాగుతున్నది. నేటి ఎపి కూటమి ప్రభుత్వం కూడా ఖనిజాల తవ్వకాలకు పారిశ్రామిక వేత్తలకు అనుమతులు ఇచ్చే ఆలోచన చేస్తున్నది. దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ముఖ్యంగా ఒడిశా, గుజరాత్, జార?ండ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో బహుళ జాతి సంస్థలు కూడా బాక్సైట్ తవ్వకాలు చేపట్టగా, స్థానికుల వ్యతిరేకత, పర్యావరణ అనుమతులు లేకపోవడం వల్ల కొన్ని ప్రాజెక్టులు ఆగిపోయాయి. మోడీ ప్రభుత్వం అటవీ హక్కుల పరిరక్షణ చట్టానికి చేసిన సవరణలుద్వారా బహుళ జాతి సంస్థలు బాక్సైట్ తవ్వకాలకు అటవీ భూములు పొందే హక్కులు కల్పించింది. బాక్సైట్ తవ్వకాలు గిరిజనుల మనుగడనే ప్రశ్నార్థకం చేస్తున్నది. వారి సమస్యలు ఏమాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టడం లేదు. బాక్సైట్‌ను బడా సంస్థలకు కట్టబెట్టటమే విధానంగా వ్యవహరిస్తున్నాయి. బాక్సైట్ తవ్వకాల వల్ల గిరిజనుల భూములు, వారి జీవనోపాధి పోతుంది. పర్యావరణ కాలుష్యం, ఆరోగ్య సమస్యలు ఏర్పడటమే కాకుండా గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలు విధ్వంసానికి లోనవుతాయి. మైనింగ్ వల్ల అడవులు నాశనమై నీటి వనరులు దెబ్బతిని పంటలకు నష్టం జరుగుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే తరతరాలుగా అడవితో పెనవేసుకొన్న గిరిజనుల జీవితం అడవికి దూరమవుతుంది. పెసా, అటవీ హక్కుల చట్టాల వంటి గిరిజనుల రక్షణ చట్టాలను మోడీ ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు పక్కన పెట్టి బాక్సైట్ మైనింగ్ తవ్వకాలు జరపడమే కాకుండా, బడా దేశీయ, విదేశీ సంస్థల తవ్వకాలకు అనుమతిస్తున్నాయి. బాక్సైట్ తవ్వకాలు దేశ అవసరాలకు పరిమితమై, గిరిజనుల జీవనానికి, పర్యావరణ పరిరక్షణకు హాని కలగకుండా జరగాలి. ప్రభుత్వ రంగ సంస్థలే ఆ పని చేయాలి. బాక్సైట్ తవ్వకాల్లోనూ, అల్యూమినా ఉత్పత్తి లోను బడా కంపెనీల ప్రయోజనాలు కాపాడుతూ, గిరిజనుల జీవితాలను ఛిన్నాభిన్నం చేయ చూస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా గిరిజనులతో చేయి కలిపి రాష్ట్ర ప్రజలు ఉద్యమించాలి.

# తొలిసారి రూ. 91 మార్కు తాకిన రూపాయి విలువ



గ్లోబల్ మార్కెట్ల ముందు భారత రూపాయి వెలవెలబోతోంది. ఇప్పటికే రికార్డు స్థాయి క్షీణతను చూసిన భారత కరెన్సీ రూపాయి, మంగళవారం మరింత పతనమైంది. భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ప్రస్తుత పరిణామాలే దేశీయ కరెన్సీ విలువ పడిపోవడానికి కారణమని ప్రభుత్వం రాజ్యసభలో పేర్కొంది. మంగళవారం ఓ దశలో దేశీయ కరెన్సీ అమెరికా డాలర్‌తో పోలిస్తే 36 పైసలు బలహీనపడి రూ. 91.14 వద్ద అత్యంత కనిష్ట స్థాయికి చేరింది. ఆ తర్వాత కొంత కోలుకున్నప్పటికీ, సాయంత్రం సమయానికి రూ. 90.94 వద్ద కొత్త కనిష్టానికి చేరింది. డాలర్ బలహీనత, అంతర్జాతీయ ముడి చమురు ధరలు భారీగా తగ్గడం కూడా దేశీయ కరెన్సీ పతనాన్ని ఆపలేకపోయాయని ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు. గత 10 ట్రేడింగ్ సెషన్లలో రూపాయి డాలర్‌కు రూ. 90 నుంచి రూ. 91కి పడిపోయింది. కేవలం గత ఐదు సెషన్లలోనే రూపాయి డాలర్‌తో పోలిస్తే 1 శాతం క్షీణించింది. మంగళవారం ఈ అంశం రాజ్యసభలో ప్రస్తావనకు రావడంతో, దీనిపై ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి మాట్లాడారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వాణిజ్య లోటు పెరగడం, విదేశీ పెట్టుబడిదారుల నుంచి బలహీనమైన మద్దతు, అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందంలో జరుగుతున్న పరిణామాలు రూపాయి విలువ క్షీణతను ప్రభావితం చేస్తున్నాయని చెప్పారు. కరెన్సీ విలువ క్షీణించడం ఎగుమతుల్లో పోటీని పెంచుతుంది. ఇది పరోక్షంగా ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావాన్ని చూపుతున్నట్టే. మరోవైపు, విలువ క్షీణత దిగుమతి చేసుకున్న వస్తువుల ధరలను పెంచవచ్చు. అయితే, మారకపు రేటు క్షీణత దేశీయ ధరలపై చూపే మొత్తం ప్రభావం, అంతర్జాతీయ వస్తువుల ధరలు దేశీయ మార్కెట్‌కు ఎంతమేరకు వస్తాయనే దానిపై ఆధారపడి ఉంటుందని ఆయన వివరించారు. 2015లో రూపాయి అమెరికా డాలర్‌తో పోలిస్తే 4.5 శాతం, 2016లో 2.6 శాతం క్షీణించింది. ఆ తర్వాత 2017లో 6.4 శాతం పెరిగిందని డేటా చెబుతోంది. 2017 నుంచి రూపాయి విలువలో నిరంతర పతనం కొనసాగుతోంది. 2018లో 8.5 శాతం, 2019లో 2.3 శాతం, 2020లో 2.3 శాతం, 2021లో 1.7 శాతం, 2022లో 10.2 శాతం, 2023లో 0.6 శాతం, 2024లో 2.8 శాతం మేర పడిపోయిందని కేంద్ర మంత్రి చెప్పారు. మరోవైపు, భారతీయ ఈక్విటీ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాలను ఎదుర్కొన్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మద్దతు లేకపోవడంతో పాటు బలహీన రూపాయి, విదేశీ ఇన్వెస్టర్ల నిధుల ఉపసంహరణ వంటి అంశాలు నష్టాలకు కారణం. దీంతో మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 533.30 పాయింట్లు కుదేలై 84,679 వద్ద, నిఫ్టీ 167.20 పాయింట్లు క్షీణించి 25,860 వద్ద ముగిశాయి. సెన్సెక్స్ ఇండెక్స్‌లో టైటాన్, భారతీ ఎయిర్‌టెల్, ఎంఅండ్ఎం, ఏషియన్ పెయింట్ షేర్లు లాభాలను దక్కించుకున్నాయి. యాక్సిస్ బ్యాంక్, ఎటర్నల్, హెచ్‌సీఎల్ టెక్, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్, అల్ట్రా సిమెంట్ స్టాక్స్ అధిక నష్టాలను నమోదు చేశాయి.



## వచ్చే ఏడాది భారత వృద్ధి 7.5 శాతం

వచ్చే ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థికవ్యవస్థ 7.5 శాతం వృద్ధి సాధిస్తుందని యాక్సిస్ క్యాపిటల్ నివేదిక తెలిపింది. ఇండియా మార్కెట్ ఔట్‌లుక్2026 పేరుతో విడుదల చేసిన నివేదిక ప్రకారం, వడ్డీ రేట్లను తగ్గించడం మూలంగా క్రెడిట్ వృద్ధి మరింత మెరుగుపడుతుందని, పెట్టుబడి, వినియోగానికి బలమైన ప్రోత్సాహాన్ని అందిస్తుందని నిపుణులు భావిస్తున్నారు.ప్రభుత్వం తన ఖర్చులను నియంత్రించడం కొనసాగిస్తున్నప్పటికీ, ఒత్తిడి మునుపటి కంటే తేలికగా ఉంటుంది. చౌకైన రుణాల వల్ల వ్యాపారాలు, వినియోగదారుల నుంచి రుణాలు తీసుకునే అవకాశాలు పెరుగుతాయి. తద్వారా ఖర్చు, పెట్టుబడులను పెంచుతుంది. అదే సమయంలో, సులభ వ్యాపార నిబంధనలు, లేబర్ కోడ్స్ మార్పులు, తక్కువ నియంత్రణ అడ్డంకులు వృద్ధికి తోడ్పడతాయని భావిస్తున్నారు. గత కొంత కాలంగా భారత్ 7 శాతం కంటే ఎక్కువగా వృద్ధి చెందుతున్న నేపథ్యంలో, దేశం దీర్ఘకాలిక వృద్ధి సామర్థ్యం ఇంకా ఎక్కువగా ఉందని నిపుణులు నమ్ముతున్నారు. వేగవంతమైన వృద్ధి ఉన్నప్పటికీ, ధరలు అదే స్థాయిలో పెరిగే అవకాశం లేదు. ఆర్థిక వ్యవస్థకు అనుకూలమైన ద్రవ్యోల్బణం 4 శాతానికి దగ్గరగా ఉంటుందని యాక్సిస్ బ్యాంక్ రీసెర్చ్ అంచనా వేసింది.



## వరుస నాలుగు రోజుల తర్వాత రూ.1,700 తగ్గిన బంగారం

హద్దుల్లేకుండా పెరుగుతున్న బంగారం ధరలకు బ్రేక్ పడింది. అంతర్జాతీయ సంకేతాలు బలహీనంగా ఉండటం, చాలామంది ఇన్వెస్టర్లు బంగారంలో పెట్టిన పెట్టుబడులను వెనక్కి తీసుకోవడంతో మంగళవారం వరుస నాలుగు రోజుల రికార్డు ర్యాలీ తర్వాత క్షీణించాయి. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం, దేశ రాజధానిలో మంగళవారం బంగారం ధరలు రూ. 1,700 తగ్గి పది గ్రాములకు రూ. 1,35,900కి చేరాయి. హైదరాబాద్ మార్కెట్లో స్వచ్ఛమైన బంగారం 10 గ్రాములు రూ.1,520 క్షీణించి రూ. 1,33,950కి పడిపోయాయి. ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల పది గ్రాములు రూ. 1,400 తగ్గి రూ.1,22,700కి చేరాయి. గడిచిన ఐదు రోజుల వ్యవధిలో బంగారం రూ. 6 వేల వరకు పెరిగింది. బంగారం ధరలు లాభాల స్వీకరణ దశకు చేరాయి. అంతర్జాతీయ మార్కెట్లలో పసిడి ధర 4,275 డాలర్ల స్థాయికి పడిపోయి ఒత్తిడికి గురైందని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ వైస్ ప్రెసిడెంట్, కమోడిటీ అండ్ కరెన్సీ రీసెర్చ్ అనలిస్ట్ జతీన్ త్రివేది అన్నారు. వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి. స్థానిక బులియన్ మార్కెట్లో మంగళవారం వెండి కిలో రూ. 4,000 తగ్గి రూ. 2,11,000కి (అన్ని పన్నులతో కలిపి) చేరింది. అంతర్జాతీయ మార్కెట్లలోనూ స్పాట్ గోల్డ్ ఐదు రోజుల వరుస లాభాల పరంపరకు తెరదించి, 27.80 డాలర్లు క్షీణించింది. ప్రస్తుతం ఔన్సు ధర 4,277.42 డాలర్లకు చేరింది.

## 600 బిలియన్ డాలర్ల తొలి సంపన్నుడిగా ఎలన్ మస్క్ రికార్డు



ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడైన ఎలన్ మస్క్ మరిన్ని కొత్త రికార్డులతో ఎవ్వరికీ అందనంత ఎత్తుకు వెళ్తున్నారు. తాజాగా ప్రపంచంలోనే 600 బిలియన్ డాలర్ల(మన కరెన్సీలో రూ.54.54 లక్షల కోట్లు) సంపద ఉన్న మొదటివ్యక్తిగా నిలిచారు. మస్క్‌కు చెందిన స్పేస్ఎక్స్ స్టార్టప్ 800 బిలియన్ల డాలర్ల విలువతో ఐపీఓకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఆయన సంపద భారీగా పుంజుకుంది. ఈ ఏడాది అక్టోబర్‌లోనే మొదటిసారిగా 500 బిలియన్ డాలర్ల మార్కును అధిగమించిన మస్క్, వచ్చే ఏడాది ఐపీఓకు వస్తున్న స్పేస్ఎక్స్‌లో 42 శాతం వాటాను కలిగి ఉన్నట్టు రాయిటర్స్ పేర్కొంది. ఫోర్బ్స్ ప్రకారం, స్పేస్ఎక్స్ వాల్యుయేషన్ కారణంగా మస్క్ సంపద 168 బిలియన్ డాలర్లు పెరిగి 677 బిలియన్ డాలర్లకు చేరింది. ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కంపెనీ టెస్లాలో మస్క్‌కు దాదాపు 12 శాతం వాటా ఉంది. ఈ ఏడాది ఇప్పటివరకు టెస్లా షేర్లు అమ్మకాలు తగ్గినప్పటికీ 13 శాతం పెరిగాయి. ఎలన్ మస్క్ సంపద 600 బిలియన్ డాలర్లు పెరగడ్మతో ప్రపంచంలో ఏ ధనవంతుడు సాధించని స్థాయిలో సంపదను సంపాదించారు. ఫోర్బ్స్ వివరాల ప్రకారం, ఎలన్ మస్క్ తర్వాత ప్రపంచ సంపన్నుల్లో ఒరాకిల్ ఫౌండర్ ల్యారీ ఎలిసన్ 400 బిలియన్ డాలర్ల మార్కును తాకారు. ఆ తర్వాత ఆయన సంపద క్షీణించింది. ప్రస్తుతం ఆయన సంపద 265 బిలియన్ డాలర్ల వద్ద ఉంది.

## పబ్లిక్ ఇష్యూకు 'ఆర్ఎస్ బ్రదర్స్' సెబీ గ్రీన్ సిగ్నల్




ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ద్వారా నిధులు సమీకరించేందుకు మల్టీఫార్మాట్ అపారెల్ రిటైల్ దిగ్గజం ఆర్ఎస్ బ్రదర్స్ రిటైల్ ఇండియా లిమిటెడ్‌కి సిద్ధమైంది. ఈ ఐపీఓకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆమోద ముద్ర వేసింది. ఈ మేరకు సెబీ అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేసిన వివరాల్లో ఈ విషయం వెల్లడించారు. హైదరాబాద్ కేంద్రంగా రిటైల్ షాపింగ్ మాల్స్ నిర్వహిస్తోన్న ఆర్ఎస్ బ్రదర్స్ తెలుగు ప్రజలతో పాటు దక్షణాధి రాష్ట్రాల ప్రజలకు సుపరిచితమే. ఈ సంస్థ వివిధ పేర్లతో షాపింగ్ మాల్స్ నిర్వహిస్తోంది. ప్రస్తుతం ఐపీఓకు వస్తుండడంతో ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షిస్తుందని చెప్పవచ్చు. ఆర్ఎస్ బ్రదర్స్ రిటైల్ ఇండియా సంస్థ హైదరాబాద్ కేంద్రంగా ప్రీమియం, మిడ్‌ప్రీమియం, వేల్యూ కస్టమర్ సెగ్మెంట్లకు సంప్రదాయ దుస్తులు, క్యాజువల్ దుస్తులు, ఫార్మల్ దుస్తుల విక్రయ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ముసాయిదా ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ) ప్రకారం ప్రతిపాదిత ఐపీఓలో భాగంగా రూ. 500 కోట్ల విలువ చేసే ఫ్రెష్ షేర్లను జారీ చేస్తోంది. అలాగే 2.98 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద జారీ చేస్తున్నారు. ప్రమోటర్లు ఆఫర్ సేల్ ద్వారా తమ వాటా విక్రయించనున్నారు. అంటే ఓఎఫ్ఎస్ ద్వారా సేకరించే నిధులు సంస్థకు వెళ్లవని చెప్పవచ్చు. సెబీ నిబంధనలకు అనుగుణంగా ప్రజా వాటా ఉండేలా చూసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఫ్రెష్ షేర్ల జారీ ద్వారా సమీకరించే నిధుల్లో రూ. 275 కోట్లను నిర్దిష్ట రుణాల చెల్లింపునకు ఉపయోగిస్తామని, మిగితా రూ. 118 కోట్లను ఆర్ ఎస్ బ్రదర్స్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ఫార్మాట్లలో కొత్త స్టోర్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. అలాగే మిగతా మొత్తాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు ఆర్ఎస్‌బీ రిటైల్ వినియోగించుకోనున్నట్లు వెల్లడించింది. 20232025 ఆర్థిక సంవత్సరాల మధ్య ఆర్ఎస్‌బీ రిటైల్ ఇండియా ఆదాయం వార్షికంగా 12.55 శాతం వృద్ధితో రూ. 2,694 కోట్లుగా నమోదు చేసింది. 2025 ఆర్థిక సంవత్సరంలో పన్ను అనంతర లాభం రూ. 104.4 కోట్లుగా నమోదైంది. ఈ ఐపీఓకు మోతీలాల్ ఓస్వాల్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్ లిమిటెడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లిమిటెడ్, ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ సర్వీసెస్ లిమిటెడ్ బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి.

## ఫ్లిప్‌కార్ట్‌లో గెలాక్సీ డేస్ సేల్‌ను ప్రకటించిన శాంసంగ్

ప్రముఖ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ శాంసంగ్ మొదటిసారి గెలాక్సీ డేస్ సేల్‌ను తీసుకొచ్చింది. ఫ్లిప్‌కార్ట్‌లో ప్రారంభించిన ఈ సేల్‌లో భాగంగా కంపెనీ తన స్మార్ట్‌ఫోన్ కొనుగోళ్లపై భారీ రాయితీలు, ప్రయోజనాలు అందిస్తున్నట్టు తెలిపింది .ఈ సేల్ డిసెంబర్ 1618 మధ్య మూడు రోజులు మాత్రమే ఉంటుందని, ఇది కేవలం ఫ్లిప్‌కార్ట్‌లో మాత్రమే అందుబాటులో ఉంటుందని స్పష్టం చేసింది. ఈకామర్స్ యాప్, వెబ్‌సైట్‌లో కస్టమర్లు అధిక ఎక్స్ఛేంజ్ ఆఫర్లు, పెయిర్‌అప్ డీల్స్, శాంసంగ్ కేర్ ప్లస్ ప్రయోజనాలు, రివార్డులను కూడా పొందవచ్చని ఫ్లిప్‌కార్ట్ వెల్లడించింది. రూ. 12,000 వరకు ఎక్స్ఛేంజ్ బోనస్‌తో పాటు ఎంపిక చేసిన గెలాక్సీ స్మార్ట్‌ఫోన్‌లపై అధిక ఎక్స్ఛేంజ్ వాల్యూ పొందవచ్చు. అదనంగా, శాంసంగ్ పెయిర్‌అప్ డీల్స్ కూడా తీసుకొచ్చింది. ఇందులో భాగంగా కస్టమర్లు అర్హత కలిగిన గెలాక్సీ స్మార్ట్‌ఫోన్‌లతో కొనుగోలు చేసినప్పుడు గెలాక్సీ వేరబుల్స్, యాక్సెసరీలపై రూ. 5000 వరకు ఆదా చేసుకోవచ్చు. ఎంపిక చేసిన శాంసంగ్ ఫోన్‌లు, వేరబుల్స్‌తో పాటు టాబ్లెట్‌లు, ల్యాప్‌టాప్‌లపైనా డిస్కౌంట్‌లను పొందవచ్చు. కస్టమర్లు శాంసంగ్ కేర్ ప్లస్ ప్లాన్‌ను కూడా యాడ్ చేసుకోవచ్చు. ఈ ప్లాన్ అర్హత ఉన్న గెలాక్సీ స్మార్ట్‌ఫోన్‌లపై ప్రమాదవశాత్తు, మరో రకంగా నష్టాలకు దీర్ఘకాలిక మద్దతును అందిస్తుంది.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్న ‘చికిరి చికిరి’

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మరోసారి స్టార్ పవర్‌తో అదరగొట్టారు. ఆయన అప్ కమింగ్ ‘పెద్ది’ చిత్రం నుంచి విడుదలైన ఫస్ట్ సింగిల్ ‘చికిరి చికిరి’ ఆన్‌లైన్‌లో సంచలనం సృష్టిస్తోంది. ఈ పాట ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఒక పెద్ద సంచలనంగా మారింది. విడుదలైన కేవలం ఒక నెలలోనే.. ఒక్క తెలుగు వెర్షన్‌లోనే 100 మిలియన్ల వ్యూస్‌ను దాటగా.. ఐదు భాషల్లో కలిపి మొత్తం 150 మిలియన్లకు పైగా వ్యూస్‌ను సాధించింది. ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన ఈ పాటలోని పవర్ ఫుల్ బీట్స్, ఆకట్టుకునే రిథమ్ అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. రామ్ చరణ్ అదిరిపోయే డ్యాన్స్ మూమెంట్స్, పవర్ ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. లెక్కలేనన్ని రీల్స్, ఫ్యాన్ ఎడిట్‌లతో అలరిస్తోంది. దర్శకుడు బుచ్చిబాబు సానా చూపించిన స్టైలిష్ విజువల్స్, ప్రతి ఫ్రేమ్‌లో కనిపించే గ్రాండియర్ ఈ పాటకు మరింత ప్లస్ అయ్యాయి. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, శివ రాజ్‌కుమార్ కీలక పాత్రలో కనిపించనున్నారు.





# ఇది చూశాక నాకు మాటలు రావడం లేదు

బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన ‘ధురంధర్’ మూవీ బాక్సాఫీసు వద్ద సంచలనం సృష్టిస్తోంది. అంతేకాకుండా కాసుల వర్షం కురిపిస్తోంది. ఈ సినిమా సినీ ప్రముఖుల చేత ప్రశంసలు పొందుతోంది. ఇప్పటికే ఐకాన్ స్టార్ వంటి స్టార్స్ ‘ధురంధర్’ని ఆకాశానికెత్తేశారు. తాజాగా, సూపర్ స్టార్‌తో నటించిన ఫుల్ పాపులారిటీ తెచ్చుకున్న ప్రీతీ జింటా ట్విట్టర్‌లో ఓ పోస్ట్ పెట్టింది. ‘ధురంధర్’ చూసిన ఆమె భావోద్వేగానికి గురైంది. ఉఈ రోజు చాలా సరదాగా గడిచింది. చాలా కాలం తర్వాత నేను ఒక్కదాన్ని థియేటర్‌లో సినిమా చూశాను. మధ్యాహ్నం షో హౌస్‌ఫుల్ అయింది. వావ్, అదొక అద్భుతమైన అనుభవం.చాలా కాలంగా నేను చూసిన ఉత్తమ చిత్రాలలో ఇది ఒకటి. సహజంగా, వాస్తవికంగా ఉంది. హృదయాన్ని హత్తుకునే, ఉత్కంఠభరితమైన సంగీతం చాలా నచ్చింది. అన్నింటికన్నా ఎక్కువగా ఆదిత్య ధర్ దర్శకత్వం చాలా నచ్చింది. చాలా కష్టమైన పని.. అయినా కూడా ఎంతో హృదయంతో చేశారు. ఇది కేవలం ఒక సినిమా కాదు. మన దేశాన్ని రక్షించడానికి ప్రమాదంలో నిలబడిన ప్రతి అజ్ఞాత పురుషుడు, మహిళ, దేశభక్తుడికి ఇది ఒక ప్రేమలేఖలాంటిది. మూడున్నర గంటలు కనురెప్ప పాటులో గడిచిపోయాయి. దీన్ని మళ్ళీ చూడటానికి సిద్ధంగా ఉన్నాను.



# ‘ఛాంపియన్’తో తెలుగులో లాంచ్ అవ్వడం నా అదృష్టం

ప్రదీప్ అద్వైతం దర్శకత్వంలో రోషన్, అనస్వర రాజన్ జంటగా నటించిన చిత్రం ‘ఛాంపియన్’. స్వప్న సినిమాస్, జీ స్టూడియోస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం డిసెంబర్ 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా హీరోయిన్ అనస్వర రాజన్ మీడియాతో ముచ్చటిస్తూ సినిమా విశేషాలను పంచుకున్నారు. వైజయంతి మూవీస్, స్వప్న సినిమాస్ వంటి ప్రతిష్ఠాత్మక బ్యానర్‌లో తెలుగు తెరకు పరిచయం కావడం తన అదృష్టమని అనస్వర తెలిపారు. తనకు తెలుగు భాష రాకపోయినా, దర్శకుడు ప్రదీప్ సహకారంతో డైలాగ్స్ పలికానని, ఇందులో తాను పోషించిన ‘చంద్రకళ’ పాత్ర ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుండిపోతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది పీరియడ్ సినిమా కావడం, ఆ కాలం నాటి కాస్ట్యూమ్స్ ధరించడం కొత్త అనుభూతినిచ్చిందన్నారు. హీరో రోషన్ అద్భుతమైన డ్యాన్సర్ అని, ‘గిరగిర’ పాట చిత్రీకరణలో ఆయన నుంచి కొన్ని డ్యాన్స్ మెలకువలు నేర్చుకున్నానని అనస్వర తెలిపారు. నిర్మాత స్వప్న దత్ తనకు అక్కలాగా అండగా నిలిచారని చెప్పారు. ఇక రామ్ చరణ్ ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉందని, తాను ‘మగధీర’ సినిమాను ఎన్నోసార్లు చూశానని గుర్తుచేసుకున్నారు. తెలుగులో అల్లు అర్జున్ తన అభిమాన హీరో అని, హైదరాబాద్ బిర్యానీ అంటే చాలా ఇష్టమని తెలిపిన అనస్వర, ప్రస్తుతం ‘ఇట్లు మీ అర్జున’ చిత్రంలో నటిస్తున్నట్లు వెల్లడించారు.



# కమర్షియల్ అంశాలతో ‘దండోరా’

‘దండోరా’ అన్ని రకాల కమర్షియల్ అంశాలతో కూడిన అద్భుతమైన చిత్రం అన్నారు నటుడు శివాజీ. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మించిన సినిమాకు మురళీ కాంత్ దర్శకత్వం వహించారు.శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి, రాధ్య, అదితి భావరా ముఖ్యపాత్రలు పోషించారు. డిసెంబర్ 25న చిత్రం రిలీజ్ కాబోతుండగా.. ఇందుకు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు శివాజీ. ‘కోర్ట్’ కంటే ముందుగానే ఈ సినిమాకు అడ్వాన్స్ తీసుకున్నానన్న ఆయన..ఇందులో తన పాత్ర చాలా కొత్తగా ఉంటుందన్నాడు. అసలు ఈ పాత్రలో శివాజీ మంచోడా? చెడ్డోడా? అని చూసే ప్రేక్షకుడికి సరిగ్గా అర్థం కాదని..సినిమా చూసిన తరువాత ఆడియన్స్ తన పాత్ర గురించి చెప్పాలన్నాడు. ఇక ఈ చిత్రంలో తాను వ్యవసాయదారుడిగా కనిపిస్తానని.. అయితే ఈ చిత్రంలోని అన్ని కారెక్టర్స్ తన చుట్టూనే తిరుగుతాయన్నాడు. అంత ఇంపార్టెన్స్ ఉన్న పాత్ర అని.. ఇలాంటి చిత్రాలు, కథలు, పాత్రలు చాలా అరుదుగా వస్తుంటాయన్నాడు. ‘దండోరా’ పూర్తిగా సందేశాత్మక చిత్రం కాదని.. అన్ని రకాల కమర్షియల్ అంశాలను జోడించి తెరకెక్కించిన అద్భుతమైన సినిమా అన్నాడు. ఇందులో గొప్ప స్క్రీన్ ప్లే ఉంటుందని.. మూవీ చాలా నేచురల్‌గా ఉంటుందన్నాడు.

# ‘గుర్రం పాపిరెడ్డి’పై బ్రహ్మానందం సెన్సేషనల్ కామెంట్స్



‘గుర్రం పాపిరెడ్డి’ లాంటి కొత్త తరహా సినిమాలను ప్రేక్షకులు ఆదరించి సపోర్ట్ చేయాలన్నారు లెజెండరీ కమెడియన్ బ్రహ్మానందం. ప్రీరిలీజ్ ప్రెస్‌మీట్‌కు హాజరైన ఆయన..’ఈ సినిమాలో నేను ఇంపార్టెంట్ రోల్ చేశాను.కథను ప్రేక్షకులకు తెలియజేసే జడ్జి పాత్రలో నటించాను. ఇదొక డిఫరెంట్ స్టోరీ. ఈ చిత్రాన్ని ఇప్పటి ప్రేక్షకులకు నచ్చేలా కొత్త పద్ధతిలో దర్శకుడు మురళీ మనోహర్ తెరకెక్కించాడు. యోగి బాబు పాత్ర స్పెషల్ అట్రాక్షన్‌గా ఉంటుంది.అతనితో నాకు కాంబినేషన్ సీన్స్ ఉండవు కానీ యోగిబాబు ఈ మూవీలో హిలేరియస్ కామెడీ చేశాడు. జీవన్ కుమార్, రాజ్ కుమార్ కసిరెడ్డి, వశీధర్ కోసిగి తమ పాత్రల్లో బాగా నటించారు. దర్శకుడు వారితో అలా పర్ఫార్మ్ చేయించారు. నేను సెట్‌లో ఉన్నప్పుడు హీరో హీరోయిన్స్ ఓల్డ్ గెటప్‌లో వచ్చి కలిశారు.ఎవరో బయటవారు షూటింగ్ చూసేందుకు వచ్చారని అనుకున్నా. ఇలా డిఫరెంట్ గెటప్స్‌లో హీరో నరేష్, హీరోయిన్ ఫరియా ఆకట్టుకుంటారు. ప్రొడ్యూసర్స్ సినిమా బాగా వచ్చేలా రాజీ పడకుండా నిర్మించారు. ఈ నెల 19న ‘గుర్రం పాపిరెడ్డి’ రిలీజ్ అవుతోంది. కొత్త వాళ్లు చేసిన ఇలాంటి చిత్రాలను ఆదరిస్తే ఇండస్ట్రీ బాగుంటుంది. మరిన్ని మంచి చిత్రాలు వారు చేసే అవకాశం కలుగుతుంది’ అని సూచించారు. కాగా నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన ఈ చిత్రాన్ని డా. సంధ్య గోలీ సమర్పణలో ప్రొడ్యూసర్స్ వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మించారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in